



APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక






విశాఖపట్నం : గురువారం 27 ఆగస్టు 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 191

## అమరావతి ఉద్యమం పచ్చి భూటకం



**తాడేపల్లి, వార్తావళి, ఆగస్ట్ 26 :** అమరావతి ఉద్యమం అనేది పచ్చి భూటకమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. 250 రోజుల ఉద్యమం అని చెప్పుకుంటూ పది మందితో ఉద్యమం నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు చేయిస్తున్న జూమ్ ఉద్యమానికి లెఫ్ట్ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని విమర్శించారు. కారల్ మార్క్స్ సిద్ధాంతాలకు విరుద్ధంగా సీపీఐ, సీపీఐఎంలు వ్యవహరిస్తున్నాయన్నారు. కమ్యూనిస్టు పార్టీలు.. చంద్రబాబు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అని మార్చుకోవాలని హితవు పలికారు. అసలు లేని అమరావతి ఉద్యమాన్ని అంతర్జాతీయ ఉద్యమంగా ప్రచారం చేస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మీ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తావా? అని చంద్రబాబును నిలదీశారు. ఎందుకు విశాఖపట్నంపై విషం కక్కుతున్నావని మండిపడ్డారు. దళితులపై ప్రేమ ఉంటే రాజధానిలో దళితులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలు ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. వైజాగ్ రాజధానిని అడ్డుకుంటే టీడీపీ నేతలు ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఎల్జీ పాలిమర్స్ వ్యవహారంలో చర్యలు తీసుకోమని డిమాండ్ చేసిన బాబు రమేష్ హాస్పిటల్ వ్యవహారంలో ఎందుకు నోరు మీదపడం లేదని ఎమ్మెల్యే కరణం ప్రశ్నించారు.

# కేంద్రం సహకారంతో సాకారం



**అమరావతి, వార్తావళి, ఆగస్ట్ 26 :** పోలవరానికి సరళతరమైన పద్ధతిలో, సకాలంలో నిధులు విడుదల చేసేలా కేంద్ర జల్‌శక్తి శాఖకు దిశానిర్దేశం చేసి 2021 డిసెంబర్ నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేలా సహకరించాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పోలవరం పనులకు రూ.15 వేల కోట్లు అవసరమని, ఆమేరకు రుణం సేకరించేలా నాబార్డును ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఖర్చు చేసిన రూ.3,805.62 కోట్లను త్వరగా రీయింబర్స్‌మెంట్ చేయడంతోపాటు ఈ విధానాన్ని పోలవరం ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం విభజన చట్టం సెక్షన్90 ప్రకారం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి శరవేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. ప్రత్యేకంగా పీపీఏను ఏర్పాటు చేసింది. ప్రాజెక్టు పనులు 33.23 శాతం పూర్తయ్యాయి. హెడ్ వర్క్స్‌లో సివిల్ పనులు 71 శాతం, కుడికాలువ పనులు 92 శాతం, ఎడమ కాలువ పనులు 52 శాతం, భూసేకరణ, సహాయ, పునరావాస ప్యాకేజీ పనులు 19 శాతం పూర్తయ్యాయి. పోలవరం ప్రాజెక్టును 2021 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించుకున్నాం. ఆలోగా నిర్వాసితులందరినీ పునరావాస కాలనీలకు తరలించాలని నిర్ణయించాం. వచ్చే సీజన్‌లో కాఫర్ డ్యామ్‌ల ఖాళీను భర్తీ చేసి ప్రధాన జలాశయం పనులు ప్రారంభిస్తాం. గడువులోగా పనులు పూర్తి చేయడం, నిర్వాసితులకు ఇళ్లు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సకాలంలో నిధులు అందుబాటులో ఉండాలి. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక పనుల కోసం ఈ ఏడాది జూన్ వరకు రూ.12,312.88 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇందులో రూ.8,507.26 కోట్లను పీపీఏ ద్వారా కేంద్రం రీయింబర్స్ చేసింది. రూ.3,805.62 కోట్లు రీయింబర్స్ చేయాల్సి ఉంది. కేంద్రం విధించిన షరతుల మేరకు ప్రాజెక్టుకు చేసిన వ్యయంపై 'కాగ్' (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ద్వారా ఆడిట్ చేయించిన స్టేట్‌మెంట్, సవరించిన అంచనా వ్యయాలను అందజేశాం. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి కేంద్ర బడ్జెట్‌లో నేరుగా నిధులు కేటాయించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మొత్తాన్ని రీయింబర్స్ చేయడంలో ఆరు నుంచి 12 నెలల వరకు తీవ్ర జాప్యం జరుగుతోంది.

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం..**

కోవిడ్ 19 మహమ్మారి వ్యాప్తిని అరికట్టేందుకు విధించిన లాక్‌డౌన్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపిన నేపథ్యంలో పోలవరం పనులకు అడ్వాన్సుగా ఖర్చు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి క్లిష్టంగా మారింది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఖర్చు చేసిన నిధులను రీయింబర్స్ చేయడంతోపాటు సకాలంలో నిధులను విడుదల చేస్తేనే ప్రాజెక్టును గడువులోగా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుంది.

## ఏపీలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ఉత్తర్వులు



**అమరావతి, వార్తావళి, ఆగస్ట్ 26 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రానికి దరఖాస్తు చేసే బాధ్యతను ఏపీఐఐసీకి అప్పగించింది. అదే విధంగా ప్రైవేట్ పార్టనర్‌ని గుర్తించే బాధ్యతను అప్పగించడం సహా.. ఐఐసీటీ, సీఎస్‌ఐఆర్‌లతో నాలెడ్జ్ పార్టనర్‌లుగా ఎంవోయూ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా 2 వేల ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర కేబినెట్ ఆమోదం ఇటీవలే ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ఏపీఐఐసీకి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీబీడీఐసీ) ఏర్పాటుకు అనుమతినిచ్చింది. ఇక తూర్పుగోదావరి జిల్లాలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కానున్న బల్క్ డ్రగ్ పార్క్ ద్వారా రానున్న ఎనిమిదేళ్లలో రూ.46,400 కోట్లు అమ్మకాలు జరుగుతాయని అంచనా. దాదాపు రూ.6940 కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనాలు ఉన్నాయి.

## లక్నోలో ఘోర బస్సు ప్రమాదం

**ఆరుగురి మృతి.. 12మందికి గాయాలు**



**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటు చేసుకుంది. రెండు స్టేట్ రోడ్‌వేస్ బస్సులు ఒకదానికితో ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా.. 12 మందికిపైగా గాయపడ్డట్లు సమాచారం. లక్నో నగర శివార్లలోని కకోరి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఉత్తరప్రదేశ్ స్టేట్ రోడ్‌వేస్ బస్సులు ఒకదానితో ఒకటి ఢీకొట్టాయి. ఇంతలో ఒక ట్రక్కు అదుపు తప్పి వాటి సమీపంలోకి వెళ్లడంతో దాని డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి అని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని కింగ్‌జార్జ్ మెడికల్ యూనివర్సిటీకి తరలించారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కకోరి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎస్ ఎం ఖాసి అబిది తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'లక్నో నుంచి వస్తున్న బస్సు, ట్రక్కును అధిగమించడానికి ప్రయత్నించింది. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది' అని తెలిపాడు. ప్రమాదం జరిగినప్పుడు అక్కడే ప్రయాణిస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు కూడా గాయపడ్డాడు. రెండు బస్సులు ఒకదానికి ఒకటి ఢీకొట్టడం చూసి తనకు కళ్లు తిరగాయని.. నియంత్రణ కోల్పోవడంతో తనకు కూడా ప్రమాదం జరిగిందని ట్రక్కు డ్రైవర్ తెలిపాడు.

## చంద్రబాబు పేరు చెబితేనే ప్రజలు భగ్గుమంటున్నారు

**అమరావతి, వార్తావళి, ఆగస్ట్ 26 :** రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరిగి 14 నెలలు కూడా ముగియలేదని, ప్రతిపక్ష నేత చంద్రబాబు గెలిచిన ఆ 23 చోట్ల కూడా బాబు పేరు చెబితే ప్రజలు భగ్గుమంటున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అలాంటి చంద్రబాబు అమరావతి పేరు మీద దొంగపోల్స్ పెడుతున్నారని మండిపడ్డారు. బాబే జీవితంగా, చంద్రబాబే సర్వస్వంగా భావించే టీవీలు, పేపర్లు, వెబ్‌సైట్లలో పెట్టే పోల్స్‌లో ఫలితాలెలా వస్తాయో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని సజ్జల చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. 14 నెలల ముందు వరకు అధికారంలో ఉండి ప్రజలపట్ల ఆయనెలా వ్యవహరించారో చంద్రబాబు మరిచిపోయారని.. అలాగే, రాష్ట్రంలోని ప్రజలు కూడా అన్ని మరిచిపోయారని చంద్రబాబు భావించడం ఆశ్చర్యం కలిగిస్తోందని పేర్కొన్నారు. తెలుగు ప్రజలు రాజకీయాలను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించే విజ్ఞానవంతులనే విషయం చంద్రబాబుకు గుర్తులేదన్నారు. బాబు దొంగ పోల్స్, డ్రామాలు ప్రజలకు తెలుసునన్నారు. ప్రజలను తన ఎత్తుగడలతో, ఎల్లో మీడియా అండతో భ్రమల్లోకి తీసుకువెళ్లగలనని చంద్రబాబు భావిస్తున్నాడని తెలిపారు.


## విలేకరులు కావలెను

'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌చార్జ్‌లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

**7032034001, 8500159006**



త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది. ఎపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను.

యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.

bulusu555@gmail.com మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు.

YouTube


## కేరళలో 27 నుంచి పద్మనాభస్వామి దర్శనాలు..



**కేరళ:** కేరళలోని అనంతపద్మనాభస్వామి ఆలయ నేలమాళిగల్లో అపార సంపదలు వెలుగుచూసిన విషయం తెలిసిందే. 2011లో నిధి నిక్షేపాలు బయటపడటంతో దేశంలోనే అత్యంత సంపన్న ఆలయంగా గుర్తింపు పొందింది.. కేరళలోని ప్రఖ్యాత అనంత పద్మనాభస్వామి ఆలయం బుధవారం నుంచి భక్తులను దర్శనం కోసం అనుమతించనున్నారు. కొవిడ్-19 కారణంగా మార్చి 21 నుంచి దర్శనాలను నిలిపివేయగా.. ఐదు నెలల అనంతరం నేడు ప్రారంభించారు. భౌతిక దూరం పాటిస్తూ స్వామి వారిని దర్శించుకునేలా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. దర్శనం కోసం భక్తులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. రోజులో గరిష్ఠంగా 665 మంది భక్తులను మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 8.00 నుంచి 11.00 గంటల వరకు, సాయంత్రం 5.00 గంటల నుంచి 8.30 గంటలకు దీపారాధనతో దర్శనం నిలిపివేస్తారు. అంతరాలయంలో కేవలం 35 మందిని అనుమతిస్తారు. దేశంలో ఆలయాలు, ప్రార్థనా మందిరాలను జూన్ 8 నుంచి తెరవడానికి కేంద్ర హోం శాఖ అనుమతించినా.. కేరళ ప్రభుత్వం మాత్రం అనంత పద్మనాభస్వామి ఆలయంలో దర్శనాలకు అనుమతించలేదు. తిరువనంతపురంలో పాజిటివ్ కేసులు పెద్ద సంఖ్యలో నమోదుకావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. దర్శనం కోసం వెళ్లే భక్తులు సోషల్ డిస్టెన్సింగ్ పాటించడం, మాస్కులు ధరించడం లాంటి నిబంధనలను కచ్చితంగా పాటించాలి. పదేళ్ల లోపు పిల్లలు, 65 ఏళ్లు దాటిన వారిని ఆలయాల్లోకి అనుమతించరు. చెప్పులు విడిచే ప్రాంతంలోనే నీళ్లు, సబ్బు, శానిటైజర్లు అందుబాటులో ఉంటాయి. థర్మల్ స్క్రీనింగ్ చేసిన తర్వాతే ఆలయంలోకి అనుమతి ఇస్తారు. భక్తులకు తీర్థం, ప్రసాదం లాంటివేం ఇవ్వరు. శఠగోపం కూడా పెట్టరు.

## 26 గంటలు శిథిలాల కిందే..

**క్షేమంగా బయటపడ్డ ఓ మహిళ**

**ముంబయి:** మహారాష్ట్రలోని రాయ్‌గఢ్‌లో భవనం కూలిన ఘటనలో ఓ మహిళ 26 గంటలపాటు శిథిలాల కింద బిక్కుబిక్కుమంటూ గడిపింది. ఒక రోజు గడిచిపోవడంతో మిగతావారు ఎవరూ బతికి ఉండరేమో అని భావిస్తున్న సమయంలో మేరున్నీస అబ్దుల్ హమీద్ కాజీ ప్రాణాలతో బయటపడటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెను సురక్షితంగా బయటకు తీసిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించాయి. ఇదే ఘటనలో ఓ నాలుగేళ్ల బాలుడు 18 గంటల తర్వాత క్షేమంగా బయటపడ్డ సంగతి తెలిసిందే. రాయ్‌గఢ్ జిల్లా కాజల్‌పురా ప్రాంతం మహద్ పట్టణంలో సోమవారం సాయంత్రం ఓ ఐదంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. దాదాపు 75 మంది భవన శిథిలాల కింద చిక్కుకుపోగా ఇప్పటివరకు 60 మందికి పైగా నివాసితులను సహాయక బృందాలు కాపాడాయి. 13 మంది ప్రాణాలు కోల్పోయారు.

## పాఠకులకు విజ్ఞప్తి

www.vaartavali.com వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీనుంచి **వార్తావళి** దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.




## కేరళ సచివాలయంలో అగ్ని ప్రమాదం



**తిరువనంతపురం:** కేరళ సచివాలయంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కొన్ని ముఖ్యమైన పత్రాలు కాలి బూడిదైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సెక్రటేరియట్ రెండో అంతస్తులోని జనరల్ అడ్మినిస్ట్రేషన్ పొలిటికల్ సెక్షన్ నుంచి పొగలు రావడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. మంటలను అదుపుచేసి కొన్ని పత్రాలను బయటకు తీశారు. కానీ, అప్పటికే కొన్ని కాలిపోయినట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. మరోవైపు ఈ ఘటనపై విపక్షాలు మండిపడ్డాయి. బంగారు ఆభరణాల చోరీ కేసుతో సంబంధమున్న పత్రాలను నాశనం చేసేందుకు ప్రభుత్వమే ఈ నాటకం ఆడిందని విమర్శలు గుప్పించాయి. బంగారం చోరీ కేసు అంశం ప్రస్తుతం ముఖ్యమంత్రి పినరయి విజయన్ కార్యాలయ పరిశీలనలో ఉంది. ప్రమాదంపై లోతుగా దర్యాప్తు చేపట్టాలని కాంగ్రెస్ నేతృత్వంలోని జేడీయూ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో సెక్రటేరియట్ ఎదుట ధర్నాకు దిగిన భాజపా నేతలను పోలీసులు అరెస్టు చేశారు.

## నీరవ్ మోదీ భార్యకు రెడ్‌కార్నర్ నోటీసులు



**దిల్లీ:** మనీలాండరింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ భార్య అమీ మోదీకి భారత్ ఇంటర్‌పోల్ అధికారులు రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంతోపాటు నీరవ్ మోదీ ప్రమేయం ఉన్న పలు కేసులతో ఆమెకు కూడా సంబంధాలున్నాయనే కారణంతో ఈ మేరకు నోటీసులు జారీ చేసినట్లు ఇంటర్‌పోల్ వెల్లడించింది. అమీ మోదీ చివరిసారిగా 2019లో అమెరికాలో కన్పించారు. ఆ తర్వాత ఆమె ఆచూకీ ఎక్కడా దొరకలేదు. నీరవ్ మోదీతోపాటు ఆయన సోదరుడు నేహాల్, సోదరి పూర్విపై కూడా ఇంటర్‌పోల్ అధికారులు రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేశారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో దాదాపు 30 మిలియన్ డాలర్ల విలువ చేసే రెండు అపార్టుమెంట్లను కొన్నారనే అభియోగంపై అమీ మోదీపై గతేడాది ఫిబ్రవరిలో ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ ప్రత్యేక ఛార్జ్‌షీటును దాఖలు చేసింది. నీరవ్ మోదీకి చెందిన దాదాపు రూ.637కోట్ల విలువైన అపార్టుమెంట్లను, లండన్‌లో రూ.56.97 కోట్ల విలువ చేసే స్థలాన్ని గత అక్టోబరులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిన నీరవ్ మోదీ విదేశాలకు పారిపోయి గతంలో బ్రిటన్‌లో తలదాచుకున్న విషయం తెలిసిందే. నీరవ్ మోదీని తిరిగి దేశానికి రప్పించాలన్న భారత్ విజ్ఞప్తిని బ్రిటన్ 2019 ఫిబ్రవరిలో ఆమోదించగా.. ఆ మరుసటి నెలలోనే ఆయనను అరెస్ట్ చేశారు. నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్‌లోని వాండ్స్ వర్త్ జైలులో ఉన్నారు.

## దీవులతో చైనాకు దీటుగా..!

### అండమాన్, లక్షదీవుల్లో భారీగా సైనిక మౌలిక వసతులు




**దిల్లీ:** హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన సైనిక ఆధిపత్యాన్ని చాటేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలకు చెక్ పెట్టేందుకు భారత్ ఒక బృహత్తర ప్రణాళికను సిద్ధం చేసింది. అండమాన్, నికోబార్, లక్ష దీవుల్లో భారీగా సైనికీకరణ, మౌలిక వసతుల నిర్మాణాన్ని చేపట్టి, డ్రాగన్ దుష్ట పన్నాగాలను భగ్నం చేయాలని నిర్ణయించింది. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని మయన్మార్, పాకిస్థాన్, ఇరాన్‌లో అనేక రేవుల నిర్మాణం ద్వారా ఇక్కడ పట్టు సాధించాలని చైనా నౌకాదళం ప్రయత్నిస్తోంది. తనకు 'పెరటి భాగమైన' ఈ ప్రాంతంలో దక్షిణ చైనా సముద్రం తరహాలో వివాదాలు, ఘర్షణలు జరిగే పరిస్థితిని నివారించేందుకు భారత్ నడుం బిగించింది. దీవుల్లో మౌలిక వసతులను భారీగా ఆధునికీకరించాలని నిర్ణయించింది. తద్వారా తన నౌకాయానానికి ఇబ్బంది లేకుండా చూడాలనుకుంటోంది. భారత సైనిక ఉన్నతాధికారుల కథనం ప్రకారం.. ఉత్తర అండమాన్స్‌లోని ఐఎన్ఎస్ కోహస్సా వైమానిక కేంద్రాన్ని, నికోబార్‌లోని క్యాంప్‌బెల్ స్ట్రిప్‌ను పూర్తిస్థాయిలో యుద్ధవిమాన స్థావరాలుగా మలుస్తారు. లక్షద్వీప్‌లోని అగట్టి వైమానిక కేంద్రాన్ని కూడా సైనిక కార్యకలాపాల కోసం ఆధునికీకరిస్తారు. తద్వారా మలాకా జలసంధి వరకూ విస్తరించిన బంగాళా ఖాతాన్ని, గల్ఫ్ ఆఫ్ ఎడెన్ వరకూ ఉన్న అరేబియా సముద్రంపై తన పట్టును భారత్ నిలుపుకొంటుంది.

## కరోనాలాంటి సమస్యలకు పరిష్కారం కనుగొనేలా హ్యాక్‌థాన్

**దిల్లీ:** కరోనా పెను సవాళ్లు విసురుతున్న వేళ కొత్త ఆవిష్కరణలు, ఆలోచనలను ప్రపంచానికి చాటేలా, ద్వైపాక్షిక సంబంధాలు బలపడేలా భారత్- జపాన్‌కు చెందిన ప్రఖ్యాత సంస్థలు హ్యాకథాన్ నిర్వహించాయి. మంగళవారం చేపట్టిన ఈ వర్చువల్ హ్యాకథాన్.. ఐఐటీ రూర్కీ, ఐఐటీ హైదరాబాద్, వీఎన్ఐటీ నాగపూర్, ఎన్ఐటీ దుర్గాపూర్ సహకారంతో రికా సంస్థ, కియో విశ్వవిద్యాలయం, భారత్-జపాన్ లేబోరేటరీ సంయుక్త సారథ్యంలో జరిగింది. కరోనాలాంటి ఊహించని విపత్కర పరిస్థితులకు ప్రత్యేకమైన పరిష్కారాలను కనుగొనడమే ఈ హ్యాకథాన్ ఉద్దేశం. ఈ హ్యాకథాన్‌లో జపాన్‌లోని భారత రాయబారి సంజయ్‌కుమార్ వర్మ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు ఇరు దేశాల మధ్య పరిశోధనాభివృద్ధిని మరింత విస్తరించేలా దోహదం చేస్తుందని, ఇరు దేశాలను బంధాన్ని ముందుకు తీసుకెళ్తాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు దేశ అవసరాలతో పాటు ప్రపంచానికి సైతం ఉపయోగపడేలా ప్రభావం చూపుతాయన్నారు. భారత ప్రధాని కార్యాలయం ముఖ్యకార్యదర్శి పీకే మిశ్రా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రత్యేక సందేశం పంపారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు యువ విద్యార్థులు, పరిశోధకుల శక్తికి జ్ఞానాన్ని అనువర్తింపజేసేలా ఏకం చేస్తుందన్నారు. ఇటీవల కేంద్రం ప్రతిపాదించిన జాతీయ విద్యావిధానం -2020 ఉద్దేశం కూడా అదేనని సందేశంలో పేర్కొన్నారు. అలాగే, ప్రపంచంలో నెలకొన్న పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా ఐరాస సూచించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన ఆకలి లేని సమాజం, మంచి ఆరోగ్యం, లింగ సమానత్వం,




సురక్షితమైన మంచినీరు, పారిశుద్ధ్యం, సుస్థిర నగరాలు, సమాజాలు ఏర్పడటం, వాతావరణ మార్పులపై తీసుకోవాల్సిన చర్యలు తదితర కీలకాంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐదు విశ్వవిద్యాలయాల నుంచి 46 మంది పాల్గొన్నారు. ఐరాస సూచించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా వినూత్న పరిష్కారాలను కనుగొనేందుకు ప్రయత్నించారు. కొత్త పద్ధతుల ద్వారా ఆరోగ్య సంరక్షణ నిర్వహణను సులభతరం చేయడంతో పాటు వీధి వ్యాపారులతో వినియోగదారులను అనుసంధానం చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, మహిళలకు విద్య, ఆరోగ్య పరిరక్షణ, ఆర్థిక వసతులను అందుబాటులోకి తేవడం, ఆహార భద్రత, నీటి వనరుల సంరక్షణ తదితర అంశాలే లక్ష్యంగా చర్చలు కొనసాగాయి.

## 'నేను అప్పుడే హెచ్చరించినా పట్టించుకోలేదు'



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గత కొన్ని నెలలుగా దేశ ఆర్థిక సంక్షోభం, మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుపై రాహుల్ విమర్శలు చేస్తూ వచ్చారు. తాజాగా భారత ఆర్థిక మందగమనంపై తాను చేసిన వ్యాఖ్యలనే ఆర్‌బీఐ ధృవీకరించిందంటూ ట్వీట్ చేశారు. 'దేశ ఆర్థిక పరిస్థితి గురించి నేను నెలల తరబడి హెచ్చరిస్తున్న విషయాన్నే ఇప్పుడు ఆర్‌బీఐ వార్షిక నివేదికలో కూడా పేర్కొంది. పారిశ్రామికవేత్తలకు పన్ను తగ్గింపు కాకుండా పేదలకు డబ్బు పంచండి. వినియోగాన్ని ప్రోత్సహించి దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించండి. మీ ప్రచారాలకు మీడియాను వాడుకున్నంత మాత్రాన భారత్ ఆర్థిక సంక్షోభంలో ఉందన్న విషయం కనిపించకమానదు' అంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ కేంద్రంపై విమర్శలు మరోసారి గుప్పించారు.

### డీఎన్ఏ, ఫోరెన్సిక్ పరీక్షలతో..

## పుల్వామా దాడి ఆధారాల సేకరణ




**దిల్లీ:** పుల్వామా ఉగ్ర దాడి కేసును సవాలుగా తీసుకుని ఆధునిక, సూక్ష్మమైన పద్ధతుల్లో ఆధారాలు సేకరించినట్టు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) పేర్కొంది. ఇందుకోసం డీఎన్ఏ, ఫోరెన్సిక్ పరీక్షలు వినియోగించినట్టు చెప్పింది. ఆత్మాహుతి దళ సభ్యుడు ఆదిల్ అహ్మద్ దార్.. కారులో శక్తివంతమైన పేలుడు పదార్థాలు నింపుకొని సైనికులున్న వాహనాన్ని ఢీకొట్టడంతో అంతా తునాతునకలయ్యాయి. దాడి తాలూకు సాక్ష్యాలే లేకుండా పోయాయి. దాడికి వినియోగించిన కారు ఎవరిదన్నది గుర్తించే వీల్లేకుండా దాని సీరియల్ నంబరు తునాతునకలైంది. చివరికి ఫోరెన్సిక్ పద్ధతుల్లో ఆ నంబరు కనిపెట్టారు. అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన సజ్జాద్ భట్ దాని యజమానిగా తేల్చారు. అలాగే కారు శకలాల్లోని ఆత్మాహుతి దళ సభ్యుడి నమూనాలు, అతని తండ్రి డీఎన్ఏ నమూనాలతో సరిపోలాకే ఆదిల్ అహ్మద్ దార్‌గా నిర్ధారించారు. ఈ దాడితో సంబంధం ఉన్న, ప్రస్తుతం ఛార్జిషీట్‌లో పేర్కొన్న వారిలో ఏడుగురు ముష్కరులను భద్రతా దళాలు ఇప్పటికే వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మట్టుబెట్టాయి. పుల్వామా దాడి అనంతరం తామే చేశామంటూ జైషే మహ్మద్ ప్రతినిధి వీడియో విడుదల చేయడంతో.. దాన్నీ ఫోరెన్సిక్ పరీక్షకు పంపారు. ఆ వీడియో ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ చిరునామాను పాకిస్థాన్‌లో గుర్తించారు. అదీకాక ఉగ్రవాదులు వాట్సాప్‌లో జరిపిన సంభాషణలు, పంచుకున్న ఫొటోలు కూడా ఈ కేసు దర్యాప్తులో ఉపకరించాయి. ఈ క్రమంలో ఇతర దేశాల సంస్థల సహకారం కూడా తీసుకున్నట్టు ఎన్ఐఏ వివరించింది.

## దౌత్య కార్యాలయాన్నే అమ్మేసిన ఘనుడు



ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా అన్నట్లుంది పాక్ అధికారుల తీరు. ఆ దేశ నాయకులు దేశాన్ని చైనాకు అమ్మేస్తుంటే.. రాయబారులు దౌత్యకార్యాలయాలను కారు చౌకగా విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. ఈ విషయాన్ని ఆ దేశ నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో గుర్తించి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

**పేపర్‌లో ప్రకటన ఇచ్చి మరీ..**

పాకిస్థాన్‌కు చెందిన మేజర్ జనరల్ సయీద్ ముస్తఫా అన్వర్ ఇండోనేషియాలో రాయబారిగా పనిచేశారు. ఇండోనేషియా రాజధాని జకార్తాలో పాక్‌కు రాయబార కార్యాలయం ఉంది. దీన్ని 2001-2002లో విక్రయించేశారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం. ఈ దెబ్బకు పాక్‌కు 1.3 మిలియన్ డాలర్ల నష్టం వచ్చింది. అన్వర్ జకార్తాలో రాయబారిగా నియమించిన వెంటనే ఈ భవనంపై కన్నేశారు. దీనిని విక్రయించేందుకు అన్వర్ అప్పట్లో ఏకంగా పత్రికా ప్రకటనే జారీ చేశారు. వాస్తవానికి దీనిని విక్రయించాలంటే పాక్ విదేశాంగశాఖ అనుమతి ఉండాలి. వాస్తవానికి ఈ ప్రాసెస్ మొదలుపెట్టే ముందే అన్వర్ విదేశాంగ శాఖకు లేఖ రాశారు. దీనికి అనుమతి నిరాకరిస్తూ ఆ శాఖ అన్వర్‌కు పలు లేఖలు రాసింది. అయినా విక్రయాన్ని పూర్తి చేశారు.

## క్షీణిస్తోన్న ప్రణబ్ ఆరోగ్యం..!



**దిల్లీ:** భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్యం క్షీణిస్తోందని దిల్లీ కంటోన్మెంట్‌లోని ఆర్మీ ఆసుపత్రి వెల్లడించింది. ప్రస్తుతం ఉపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు చికిత్స అందిస్తున్నామని పేర్కొంది. ఆయనకు నిన్నటినుంచి కిడ్నీ సంబంధ సమస్యలు కూడా ఎదురౌతున్నట్లు తాజా బులెటిన్‌లో పేర్కొంది. ప్రస్తుతం కోమాలో ఉన్న ప్రణబ్ ముఖర్జీకి వెంటిలేటర్ సహాయంతోనే చికిత్స అందిస్తున్నామని ఆర్మీ ఆసుప్రతి ప్రకటించింది. మెదడులో రక్తం గడ్డకట్టడంతో ఆగస్టు 10వ తేదీన ప్రణబ్ ముఖర్జీ దిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో నిర్వహించిన కొవిడ్ పరీక్షల్లో ప్రణబ్ ముఖర్జీకి కరోనా వైరస్ సోకినట్లు తేలింది. అనంతరం ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం ప్రత్యేక వైద్యబృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది.

## 'అమెరికా చర్యలతో పెద్ద ప్రమాదమే జరిగుండేది'

### అగ్రరాజ్యంపై చైనా ఆగ్రహం



**బీజింగ్:** అమెరికాకు చెందిన ఓ నిఘా విమానం ఇటీవల తమ అధీనంలో ఉన్న గగనతలంలోకి ప్రవేశించిందని చైనా ఆరోపించింది. ఆ ప్రాంతం 'నో ఫ్లై' జోన్‌గా ఉందని.. అక్కడ తాము తరచూ 'లైవ్ ఫైర్ డ్రిల్స్' నిర్వహిస్తామని చెప్పుకొచ్చింది. అగ్రరాజ్యపు చర్యలు చైనాను రెచ్చగొట్టేలా ఉన్నాయంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి వూ కియాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అక్కడి అధికారిక మీడియా తెలిపింది. అమెరికాకు చెందిన 'యూ-2 రికనైసాన్స్ జెట్' ఇటీవల ఉత్తర చైనా ప్రాంతంలో చక్కర్లు కొట్టినట్లు అక్కడి మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ చర్య పెద్ద ప్రమాదానికి దారి తీసి ఉండేదని అక్కడి విదేశాంగ శాఖ అభిప్రాయపడ్డట్లు వెల్లడించాయి. దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్న విషయాన్ని అమెరికా దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపాయి. ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ చైనా స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది. వాణిజ్య, సైనిక, రాజకీయ పరంగా ఉభయ దేశాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. కొవిడ్ మహమ్మారి విజృంభణ, హాంకాంగ్ అల్లర్లు, భారత్-చైనా సరిహద్దు వివాదం వంటి పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణిస్తూ వస్తున్నాయి. ఈ క్రమంలో చైనా ప్రాదేశిక దురాక్రమణలను సవాల్ చేస్తూ తైవాన్, దక్షిణ చైనా సుముద్రం వంటి ప్రాంతాల్లో అమెరికా సైనిక కార్యకలాపాలు నిర్వహిస్తుండడం డ్రాగన్‌ను మరింత ఆగ్రహానికి గురిచేస్తోంది.


## భారత్: ఒక్కరోజే 1059 మంది మృత్యువాత!



**దిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ మహమ్మారి విలయతాండవం కొనసాగుతూనే ఉంది. గడిచిన కొన్ని రోజులుగా మరణాల సంఖ్య తగ్గినప్పటికీ నిన్న మళ్లీ ఈ సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. గడిచిన 24గంటల్లో 1059 మంది కొవిడ్ రోగులు మృత్యువాతపడ్డారు. ఈ స్థాయిలో మరణాలు సంభవించడం ఇది రెండోసారి. ఆగస్టు 19న అత్యధికంగా 1092 మరణాలు నమోదయ్యాయి. బుధవారం నాటికి దేశంలో కరోనా మరణాల సంఖ్య 59,449కు చేరినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిన్న మరో 67,151 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కరోనా కేసుల సంఖ్య 32,34,474కు చేరింది. వీరిలో ఇప్పటివరకు 24లక్షల మంది కోలుకోగా మరో 7లక్షల క్రియాశీల కేసులు ఉన్నాయి. నిన్న మరో 63వేల మంది బాధితులు వైరస్ నుంచి కోలుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల రికవరీ రేటు 76శాతానికి చేరింది. మరో 23శాతం యాక్టివ్ కేసులుండగా, మరణాల రేటు 1.8శాతంగా ఉంది. దేశవ్యాప్తంగా కొవిడ్ నిర్ధారణ పరీక్షలు భారీగానే నిర్వహిస్తున్నారు. మంగళవారంనాడు దేశవ్యాప్తంగా 8లక్షల 23వేల శాంపిళ్లకు కొవిడ్ టెస్టులు నిర్వహించినట్లు భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) వెల్లడించింది. ఇప్పటివరకు దేశంలో 3కోట్ల 76లక్షల శాంపిళ్లకు కరోనా పరీక్షలు పూర్తిచేసినట్లు ఐసీఎంఆర్ పేర్కొంది. ఆగస్టు 21వ తేదీన ఒక్కరోజే రికార్డుస్థాయిలో 10లక్షల 23వేల పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం కరోనా కేసుల పాజిటివిటీ రేటు 8.6శాతంగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. అయితే, దేశవ్యాప్తంగా వైరస్ తీవ్రత పెరగడానికి బాధ్యతారాహిత్య వ్యక్తులే కారణమని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ అభిప్రాయపడ్డారు. కొందరి నిర్లక్ష్యంతోనే వైరస్ వ్యాప్తి విస్తృతంగా ఉంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

## గల్వాన్ ఘటన దురదృష్టకరం: చైనా

### రెండు నెలల తర్వాత డ్రాగన్ పశ్చాత్తాప వ్యాఖ్యలు



**దిల్లీ:** సరిహద్దులో 20 మంది భారత సైనికుల ప్రాణాలను బలితీసుకున్న గల్వాన్ ఘర్షణను చైనా 'దురదృష్టకర సంఘటన'గా అభివర్ణించింది. ఘటన జరిగిన రెండు నెలల తర్వాత చైనా ఈ పశ్చాత్తాప వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇలాంటి ఘటనల్ని ఇరు దేశాలూ కోరుకోవడం లేదని భారత్‌లోని ఆ దేశ రాయబారి సన్ వీడాంగ్ అన్నారు. 'ఇండియా-చైనా యూత్ ఫోరం' ఆగస్టు 18న నిర్వహించిన వెబినార్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు చైనా రాయబార కార్యాలయం మంగళవారం సాయంత్రం వెల్లడిం చింది. గల్వాన్ లాంటి దురదృష్టకర ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని వీడాంగ్ అభిప్రాయపడ్డారు. అందుకు సంబంధించి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఘటన తర్వాత నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగేలా పలు దఫాలు ఇరు దేశాల సైనికాధికారులు జరిపిన చర్చలు- వాటి ఫలితంగా చోటుచేసుకున్న పరిణామాల్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలుగా ఉన్న భారత్, చైనా మధ్య పరస్పర సహకారం ఎంతో అవసరమని వీడాంగ్ అభిప్రాయపడ్డారు. వివాదాలకు స్వస్తి పలికి అభివృద్ధి దిశగా సాగాల్సిన అవసరం ఉందన్నారు. భారత్‌ను చైనా ప్రత్యర్థిగా కాకుండా ఓ మిత్రదేశంగా.. ముప్పుగా కాకుండా ఓ అవకాశంగా భావిస్తోందని వీడాంగ్ చెప్పుకొచ్చారు. ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా సరిహద్దు వివాదాల్ని సైతం పరిష్కరించుకునేందుకు కృషి చేస్తామన్నారు. చైనా దురాక్రమణను చవిచూసిన తర్వాత భారత్‌లో పెరిగిన స్వయంసమృద్ధి నినాదాన్ని సన్ వీడాంగ్ ఈ సందర్భంగా పరోక్షంగా ప్రస్తావించారు. ఏ దేశమూ ఒంటరిగా అభివృద్ధి సాధించడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ప్రపంచీకరణ యుగంలో స్వయం సమృద్ధి సాధిస్తూనే ఇతరులకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఏళ్లుగా ఇరు దేశాల మధ్య నెలకొన్న బలమైన సంబంధాలు తాజాగా నెలకొన్న ప్రతికూల పరిస్థితుల్ని పరిష్కరించుకునేందుకు దోహదం చేస్తాయని వీడాంగ్ విశ్వాసం వ్యక్తం చేశారు.



## విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ వార్తలు

# బొత్సను పరామర్శించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వెల్లంపల్లి



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 26 :** రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి బొత్స సత్యనారాయణను ఆయన నివాసంలో, జిల్లా ఇన్చార్జి మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ఇటీవల స్వర్గస్థులైన మంత్రి బొత్స మాతృమూర్తి ఈశ్వరమ్మ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మంత్రి వెల్లంపల్లితో కలిసి వచ్చిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ మల్లాది విష్ణు, పార్టీ నాయకులు దేవినేని అవినాష్ కూడా బొత్స కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బొత్స అప్పలనరసయ్య, కోలగట్ల వీరభద్రస్వామి, అలజంగి జోగారావు, జిల్లా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలోని సిటీ బస్టాండ్ ఆవరణలో గల రోజు శ్రీ అభయ ఆంజనేయ స్వామి కి ఉదయం పంచామృత అభిషేకాలు మరియు స్వామి కి ప్రీతీకరమైన కదళి ఫలాలు అరటిపళ్ళ తొ ప్రత్యేక పూజలు అర్చకులు గాయత్రి శర్మ నిర్వహించారు.
– వార్తావళి, విజయనగరం



# సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆర్‌డిఓ భవానీ శంకర్



**నెల్లిమర్ల (విజయనగరం), వార్తావళి, ఆగస్టు 26 :** నెల్లిమర్ల మండలంలోని జరజాపుపేట గ్రామ సచివాలయాన్ని విజయనగరం ఆర్‌డిఓ బిహెచ్ భవానీశంకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, వాలంటీర్లతో మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన సేవలను, మరింత వేగంగా అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే ఈ–క్రాప్‌పై దృష్టిపెట్టి, నమోదును వేగవంతం చేయాలని ఆర్‌డిఓ సూచించారు. పేదలకు పంపిణీ చేసేందుకు కొండవెలగాడ గ్రామం వద్ద రూపొందించిన లేఅవుట్‌ను ఆర్‌డిఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంట నెల్లిమర్ల తాశీల్దార్ రాము, ఎంపిడిఓ రాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోలీసులంటే నేరస్థులు భయపడాలి - ప్రజలు కాదు

**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 26 :** పోలీసు శాఖలోని అన్ని అంతర్గత డిపార్ట్మెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ లో ఏపీ డీజీపీ?ఫ్రెండ్లీ పోలీసింగ్ పై అందరు పోలీసు అధికారులకు దిశా నిర్దేశం ఇటీవల జరిగిన శిరోముండనం సంఘటనతో మొత్తం పోలీసులందరికీ ప్రవర్తన నియమావళిపై దిశ నిర్దేశంక్రింది స్థాయి అధికారుల వరకూ దిశా నిర్దేశం క్షేత్ర స్థాయిలో పోలీసు స్టేషన్లకు వస్తుమ్న బాధితుల పట్ల ఎలా వ్యవహరించాలి అన్న దానిపై దిశ నిర్దేశం బాధితులతో పోలీసుల వ్యవహారశైలి ఎల ఉండాలి అన్న దానిపై దిశానిర్దేశం? ప్రజలు గౌరవిస్తూ నేరస్థులు భయపడాలి... పోలీస్ వ్యవస్థలో ప్రక్షాళన కావాలి.. కోవిడ్ సమయంలో పోలీసుల సర్వీసులో చాలా మంచి పేరు తెచ్చుకున్నాం.. ఒక పోలీసు తప్పు చేస్తే పోలీస్ వ్యవస్థ మొత్తాన్ని తప్పు పడతారు.. తొలిసారి ఇంత పెద్ద సమావేశం నిర్వహిస్తున్నాం.. ఈ ప్రభుత్వానికి మార్పు పరివర్తన ముఖ్య అజెండా.. సామాన్య ప్రజలకు పోలీసు సేవలు అందుబాటులో ఉండాలి.. గత సంవత్సరంగా అదే ఆలోచనతో పని చేస్తున్నాం.. కోవిడ్ సమయంలో మన పోలీసుల సేవలు అభినందనీయం.. అనుకోకుండా జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో కొందరు సామాన్యులు ఇబ్బంది పడ్డారు.. న్యాయపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోంది.. నేరం చేస్తే డిపార్ట్మెంట్ న్యాయ పరమైన చర్యలు కచ్చితంగా ఉంటాయి. పోలీసు సిబ్బంది మీద పోలీసులే చర్యలు తీసుకోవడం చాలా బాధాకరం.. కానీ తప్పదు ఆత్మ విమర్శ చేసుకోవడం చాలా అవసరం మార్పు కోసం చేయాల్సింది చాలా ఉంది మనం అందరం కలిసి చేద్దాం. ప్రభుత్వం ప్రజలు మనకు బాధ్యత అప్పుజెప్పారని టీం అందరికీ అర్థమౌతుందని అనుకుంటాను పోలీసు సిబ్బంది మొత్తం రాబోయే రెండు నెలలో ఓరియంటేషన్ క్లాసులు అటెండ్ అవ్వాలి. మార్పులు ప్రతీ పోలీసు స్టేషన్లో కనిపించాలి.

# రైతాంగానికి యూరియా కొరత ఉండరాదు

### అధికారులకు స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ జె.నివాస్



**శ్రీకాకుళం, వార్తావళి, ఆగస్ట్ 26 :** జిల్లాలోని రైతాంగానికి ఎట్టిపరిస్థితిల్లోనూ యూరియా కొరత ఉండరాదని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులకు స్పష్టం చేసారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ వ్యవసాయానికి సంబంధించి రైతులకు అవసరమైన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని, ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ వివరించారు. జిల్లాలో వ్యవసాయ శాఖ, మార్క్ఫెడ్ సమన్వయంతో పనిచేసి జిల్లాలోని రైతాంగానికి యూరియా కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టర్ బంగ్లాలో రైతాంగానికి యూరియా, విత్తనాలు సరఫరాపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 23,059 మెట్రిక్ టన్నుల ఎరువులు లభ్యంగా ఉన్నాయని, ఇంకా అదనంగా కావలసిన యూరియాను తెప్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తొలుత వ్యవసాయ , మార్క్ఫెడ్ శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రోజు విడిచి రోజు యూరియా నిల్వలు రప్పిస్తున్నామని, నాలుగు మండలాలను ఒక యూనిట్ గా విభజించి 200 మెట్రిక్ టన్నుల నిల్వలను ఆయా చోట్ల అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా రైతాంగం వినియోగిస్తున్న ఎరువుల అంచనా ప్రకారం దానిని పరిగణలోకి తీసుకొని లక్ష్యాన్ని నిర్ధేశించామని తెలిపారు. 7,500 మెట్రిక్ టన్నుల ఐపిఎల్ ,వెయ్యి టన్నుల స్పిక్, వెయ్యి టన్నుల కోరమండల్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, ఎరువులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు గాను తనిఖీ బృందాలు ఏర్పాటు చేశామని, అక్రమంగా అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కు వివరించారు. జిల్లాలో రైతాంగానికి సక్రమంగా వాటిని పంపిణీ అయ్యేలా చూడాలని, ఏ ఒక్క రైతు నష్టపోరాదని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె. శ్రీధర్, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ కె.యు.పి.రమణి, డి.సి.సి.బి ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి.సత్యనారాయణ, ఆత్మా పథక సంచాలకులు కె.కృష్ణారావు, క్వాలిటీ కంట్రోల్ ఇన్ స్పెక్టర్ అజయ్ పాల్గొన్నారు.

# పని భద్రత పెంచిన కూలిరేట్లను తక్షణమే అమలు చేయాలి

### జిల్లా అధ్యక్షులు ముళ్ళు నరసింహులు డిమాండ్



**సాలూరు, వార్తావళి, ఆగస్ట్ 26 :** రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లైస్ హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లైస్ హమాలి యూనియన్. ఎఐటియుసి అనుబంధం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బొబ్బిలి లో ఉన్నటువంటి పాయింట్ వద్ద హమాలీ కార్మికులు సమ్మె చేయడం జరిగింది. ఈ సందర్భంగా సివిల్ సప్లైస్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బుల్లి నర్సింలు మాట్లాడుతూ జనవరి నెల నుండి హమాలీ కార్మికులకు కూలీ రేట్లుపెంచవలసి ఉండగా ఇంతవరకు పెంచకపోవడం అన్యాయమని ఇదే సమస్యపై గతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించిన పట్టించుకోవడం లేదని అన్నారు. ఈనెల26..27 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాయింట్లు వద్ద సమ్మె చేస్తున్నట్లు తెలిపారు అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హమాలీ కార్మికులు అందరికీ ఈఎస్ఐ అమలు చేయాలని ప్రధానమంత్రి బీమా సౌకర్యం హమాలీ కార్మికులకు వర్తించే విధంగా చూడాలని .రిటైరైన హమాలీ కార్మికులకు వెంటనే పిఎఫ్ ఇవ్వాలని .పిఎఫ్ పెన్షన్ అమలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ ఏ ఐ టి యు సి అనుబంధం జిల్లా అధ్యక్షులు ముళ్ళు. నరసింహులు గోవిందరావు. గోపాల్‌రావు నరసింహులు పాల్గొన్నారు.

# తెలుగు సాహితీ జగత్తులో సుస్థిర స్థానం



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 26 :** విజయనగరంలో పుట్టి పెరిగి "ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం" సంస్థ వ్యవస్థాపకురాలిగా అందరికీ సుపరిచితురాలైన మంగిపూడి రాధిక, సింగపూర్ నుండి తెలుగు సాహితీ జగత్తులో తనదైన స్థానం సుస్థిరం చేసుకున్నారు. సింగపూర్ వాస్తవ్యురాలిగా తన అనుభవాలతో విశ్లేషణలతో రూపొందించిన కథలను, పుస్తకరూపంలో వెలువరించనున్నారు. "అలా సింగపురంలో.." అనే పేరుతో ఈ కథా సంకలనాన్ని ప్రపంచ ప్రఖ్యాత ప్రచురణ సంస్థ "వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా" వారు ప్రచురణకు గ్రహించి అక్టోబరులో జరుగబోయే '7వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు'లో పుస్తకావిష్కరణ గావించనున్నారు. సింగపూర్‌లో నివసించే తెలుగు రచయితలలో కథా సంకలనాన్ని వెలువరిస్తున్న తొలి రచయితగా శ్రీమతి రాధిక 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకున్నారు. "శ్రీ శ్రీ, వింజమూరి అనసూయాదేవి వంటి మహానుభావుల పుస్తకాలను ప్రచురించిన ప్రఖ్యాత వంగూరి ఫౌండేషన్ సంస్థ ద్వారా నా పుస్తకం ప్రచురింపబడడం చాలా ఆనందంగా ఉంది. సింగపూర్ లో నివసించే తెలుగువారిలో తొలి కథా రచయిత్రిగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు గుర్తించడం మరింత ఉత్సాహాన్ని నింపింది. గత ఏడాది స్వర్గస్తులైన నా మాతృమూర్తి, విజయనగరం మహిళా కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు, శ్రీమతి దామరాజు మంగతాయారు గారి మొదటి వర్ధంతి రోజున వారికి అంకితమిస్తున్న ఈ ఈ పుస్తకాన్ని గూర్చి ప్రకటించగలగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సందర్భంగా వంగూరి ఫౌండేషన్ అధ్యక్షులు చిట్టెన్ రాజు గారికి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అధ్యక్షులు శ్రీ వెంకటాచారి గారికి మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను." అని శ్రీమతి రాధిక ఫేస్బుక్ ద్వారా బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ద్వారా ప్రకటించారు.

# ఆన్‌లైను మోసాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 26 :** విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి రాష్ట్ర పోలీసుశాఖ, సిఐడి విభాగం మరియు సైబరు పీస్ ఫౌండేషను సంయుక్తంగా నిర్వహిస్తున్న "ఈ రక్షా బంధన్ 4 ఎస్" కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు ప్రముఖ సైబరు నిపుణుల సహకారంతో 'సైబరు నేరాలు శిక్షలు' అనే అంశంపై వెబినార్‌ను నిర్వహించి, మహిళలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సీనియర్ సిటిజన్స్‌కు సైబరు నేరాలు, వాటికి విధించే శిక్షలు గురించి గురించి, అవగాహన కల్పించినట్లుగా జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి మాట్లాడుతూ ఆన్‌లైను విస్తరించడంతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిపోయిందన్నారు. సాంకేతికత పెరగడం వలన విజ్ఞానం విస్తృతం అవ్వడంతోపాటు, కొత్త తరహా నేరాలు కూడా జరుగుతునే ఉన్నాయి. ఈ తరహా నేరాలకు విధించే శిక్షలు కూడా కఠినంగానే ఉన్నప్పటికి, కేసుల దర్యాప్తు క్లిష్టంగా మారుతున్నాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000లో ప్రారంభమయ్యింది. ప్రస్తుతం జరుగుతున్న సైబరు నేరాలను విశ్లేషించి, 2008లో చట్టంలో కొన్ని మార్పులను తీసుకు వచ్చారన్నారు. నకిలీ వెబ్‌సైట్లు కూడా విపరీతంగా పెరిగి, మోసాలకు పాల్పడే సైబరు నేరగాళ్ళు కూడా పెరిగారు. ఈ తరహా నేరాలు జరిగినపుడు ఐపిసితో పాటు ఐటి చట్టం క్రింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, నిందితులు శిక్షింపబడే విధంగా పోలీసుశాఖ చర్యలు చేపడుతుందన్నారు. ఎలక్ట్రానిక్ డివైజ్‌ను వినియోగించి డాక్యుమెంటులో మార్పులు చేసినట్లయితే ఐటి చట్టం సెక్షను 65 ప్రకారం నిందితులకు 3 సం॥ల జైలు లేదా రూ॥ 2 లక్షలు జరిమానా విధిస్తారు. సైబరు నేరాలకు విధించే శిక్షలు గురించి సిఐడి అదనపు డిజి పివి సునీల్ కుమార్, సైబరు ఎఫ్ఎస్ఎల్, అసిస్టెంట్ డైరెక్టరు ఎం కృష్ణ, సిడాక్ అసోసియేట్ డైరెక్టరు సిహెచ్.ఎ.ఎస్. మూర్తి, సైబరు పీస్ ఫౌండేషను ప్రతినిధి ఐఎల్ఎన్ రావు పాల్గని, మహిళలు, విద్యార్థులు, ప్రజలకు సైబరు నేరాలుకు విధించే శిక్షలు గురించి అవగాహన కల్పించారని జిల్లా ఎస్పీ బి. రాజకకుమారి తెలిపారు.

# పలు మండలాల్లో కరోనా పాజిటివ్ నమోదు



**పార్వతీపురం, వార్తావళి, ఆగస్ట్ 26 :** గరుబిల్లి మండలం నాగూరు, రావుపల్లి. పార్వతీపురం మండలం అడ్డాపుసీల, జమదాల. కురుపాం మండలం ఆర్.కే. బాయ్, ఒబ్బంగి, బొబ్బిలి మండలం టి. ఆర్.కాలని, కోమటి పల్లి. మక్కువ మండలం సరాయివలస.సాలూరు మండలం జీగిరం, కొమరాడ మండలం విక్రంపురం, తెర్లాం మండలం కుసుమూరు, వెలగవలస గ్రామాలలో పాజిటివ్ కేసులు నమోదైన దృష్ట్యా కంటైన్మెంట్ జోన్ గా ప్రకటిస్తూ పార్వతీపురం సబ్ కలెక్టర్ వీధెఖర్ ఉత్తర్వులు జారీ చేసారు. ఆయా కరోనా పాజిటివ్ కేసు నివాసి గృహం నుండి 200 మీటర్ల వరకు కంటైన్మెంట్ జోన్‌గాను, 400 మీటర్ల వరకు బఫర్ కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించామని తెలిపారు. కంటైన్మెంట్ జోన్ పరిధిలో గల ప్రజలంతా అత్యవసరం నిమిత్తం తప్పా బయటకు రాకూడదని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రజలంతా వీలున్నంత వరకు గృహ నిర్భంధంలో ఉండాలని, మాస్క్ లు, గ్లౌజులు త ప్ప క ం డా వినియోగించాలని, వ్యక్తుల మధ్య దూరాన్ని పాటిస్తూ ఆరోగ్య సేతు యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. అదేవిధంగా కరోనా లక్షణాలైన దగ్గు, జలుబు, జ్వరం ఉన్న వారు నిర్ధారణ పరీక్షలు జరుపుకోవాలన్నారు. పాజిటివ్ నమోదైన వ్యక్తితో కాంటాక్ట్ అయిన వారు వెంటనే హోమ్ క్వారంటైన్ లోనికి వెళ్లాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బంది ఆ ప్రాంతాన్ని హైపోక్లోరెడ్ ద్రావణాన్ని పిచికారి చేయడం జరుగుతుందన్నారు. కంటైన్మెంట్ జోన్ పరిధిలో చెక్ పోస్టులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రజలంతా జాగ్రత్తగా, స్వీయ రక్షణలో ఉండాలని తెలిపారు.

# సమర్థవంతమైన పాఠశాల ఆరోగ్యం, వనరులనుపై సమీక్ష



**పార్వతీపురం, వార్తావళి, ఆగస్ట్ 26 :** ప్రభుత్వ అభివృధి కార్యక్రమాలు, విద్యా, వైద్యం సబ్ ప్లాన్ మండలాలలో గిరిజనులందరికీ అందుబాటులో వుండాలి అని ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి పేర్కొన్నారు. మంగళవారం ప్రాజెక్ట్ అధికారి తన ఛాంబర్లో సమర్థవంతమైన పాఠశాల ఆరోగ్యం, వనరులను కేంద్రీకరించడం పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ సాలూరు, పార్వతీపురం, జి.ఎల్.పురం లలో గిరిజన మహిళలకోసం ఏర్పాటు చేసిన గర్భిణీ వసతి గృహం నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు, డేకేర్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి కేంద్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు చపట్టాల్సిందిగా డి.డి.కి ఆదేశించారు. అలాగే రిఫరల్ మేనేజ్మెంట్ హాస్పిటల్ సంబంధించి ఏవిధంగా నిర్వహిస్తున్నారు అన్న వివరాలు ఉప వైద్య ఆరోగ్య అధికారికి అడిగి తెలుసుకు న్నారు, గ్రామాలలో హెల్త్ వొలెంటేర్స్ అవసరం అని ఉప వైద్య ఆరోగ్య అధికారి తెలిపారు. సబ్ ప్లాన్ ఏరియాలో వై.ఎస్.అర్.సంపూర్ణ పోషణ సెప్టెంబర్ నుండి వై.ఎస్.అర్.సంపూర్ణ పోషణ ప్లేస్ గా మారుతుందన్నారు. సంపూర్ణ పోషణలో ఏయే ఆహార పదార్థాలను అందిస్తున్నారు అన్న వివరాలు పై ఐ.వి.డి.ఎస్. ఏ.పి.డి తో సమీక్షించారు. సబ్ ప్లాన్ ఏరియాలో ఉన్న ఆశ్రమ పాఠశాల నిర్వహణ, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై డిప్యూటీ డి. ఇ. ఓ తో సమీక్షించారు. ఆర్. ఓ.ఎఫ్.ఆర్ త్వరిత గతిన పూర్తిచేయాలన్నారు. సబ్ ప్లాన్ మండలాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి సంబందించిన వివరాలు ఏ.పి.డి.ఎన్.అర్.జి.ఎస్ వివరించారు. మొక్కలు నాటే కార్యక్రమం తరిత గతిన పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశానికి ఎ.పి. ఓ సురేష్ కుమార్ ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవి కుమార్ రెడ్డి, వెలుగు ఎ.పి.డి సావిత్రమ్మ, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ శ్రీహరి, ఉప విద్యాధికారి మోహన రాయుడు, డెప్యూటీ డైరెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# యువత సేవారంగంవైపు అడుగు వెయ్యాలి: భీశెట్టి




**పూసపాటిరేగ, వార్తావళి, ఆగస్ట్ 26 :**సాయం చెయ్యడానికి ఉండాల్సింది డబ్బుకాదని మంచి మనసు మాత్రమేనని, ప్రపంచ ప్రజల గుండెల్లో అమ్మగా స్టానం పొందిన మదర్ థేరిస్సా నిరూపించారని లోక్సత్తపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి ఫౌండేషన్ అధినేత భీశెట్టిబాబ్జి అన్నారు, బుధవారం అట్టాడ గ్రామంలో ఉన్న బీఎన్ఆర్ ఆశ్రమం లో మదర్ థేరిస్సా 110 వ జయంతి వేడుకల సభనిర్వహించారు థేరిస్సా చిత్రపటంవద్ద జ్యోతి వెలిగించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో యువత ప్రేమమూర్తి ని ఆదర్శంగా తీసుకుని సేవారంగంలో రావలసిన అవసరముందని మన దేశంలో చాలా మందికి సేవలు అవసరం ఉందని అన్నారు, మదర్ థేరిస్సా 1910 ఆగస్ట్ 26 న యుగోస్లేవియా దేశంలో స్కోప్టే అనే ప్రాంతంలో జన్మించారని ప్రపంచంలో ఎక్కడైనా నిరుపేదలకు సేవలు అందించాలని తనజీవితాన్ని మానవసేవకు అంకితం చేసారని 1922లో భారత్ చేరుకొని 1929లో కలకత్తాలో సెయింట్ మేరీస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా జీవితం ప్రారంభించి అనంతరం 1952లో నిర్మలహృదయ పేరిట తొలి సేవ సంస్థ ఏర్పాటుచేసి అనంతరం అనాదబాలలకోసం శిశుభవన్, కలకత్తా సమీపాన 30 ఎకరాల్లో కుష్ఠురోగుల కోసం శాంతి నగరం ను ఏర్పాటుచేశారని, తన జీవితం చివరి దశలోగా దేశంలో 400 విద్యాసంస్థలు, సంచార ఆసుపత్రులు, పిల్లలకి పోశకాహారా కేంద్రాలు నిర్మించారన్నారు. ఈ జయంతి కార్యక్రమంలో బీఎన్ఆర్ ఆశ్రమం నిర్వాహకులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు,పూసర్ల రాజేశ్,నమ్మి శ్రీనివాస్, పోటుపురెడ్డి శ్రీనివాస రావు, ముంగా రాంబాబు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీపి పురస్కారం



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 26 :** విజయనగరం, ఆగస్టు 27 జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారికి అరుదైన గౌరవం దక్కింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఓఎన్‌హెచ్ (అవర్ నైబర్‌హుడ్ హీరో) పురస్కారానికి ఆమె ఎంపికయ్యారు. జిల్లాలో కరోనా ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడమేకాకుండా ,ఇతర ప్రాంతాల నుంచి నడిచి వచ్చే వారికి ఆహరపదర్థాలను అందించడం, జిల్లాలో వ్యాధి వ్యాప్తిని అడ్డుకోవడం, మరణాలను తగ్గించడం, విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడం తదితర చర్యల ద్వారా సమర్థవంతంగా వ్యాధిని అదుపు చేసేందుకు కృషి చేస్తున్న జిల్లా ఎస్పీ ను ఈ ఓఎన్‌హెచ్ పురస్కారానికి ఎంపిక చేశారు. కోవిడ్ నియంత్రణకు విశేషంగా కృషి చేస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థలకు ప్రతిష్టాత్మకంగా ఓఎన్‌హెచ్ పురస్కారాన్నిహెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు అందజేస్తోంది. ఈ పురస్కారాన్ని ఆ బ్యాంకు ఉన్నతాధికారులు బుధవారం ఎస్పీ గారి ఛాంబర్‌లో అందజేసారు. ఈ కార్యక్రమంలోఏ ఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, ఎస్బీ సి ఐ లు వి వి అప్పారావు, ఎన్. శ్రీనివాసరావు, జి. రాంబాబు మరియు ఇతర పోలీసు అధికారులు,హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ సందీప్ పట్నాయక్, బ్రాంచ్ మేనేజర్ ఠాగూర్ పాల్గొన్నారు.

## నిర్వాసితులకు అన్ని వసతులూ కల్పించాలి: ఆర్‌డిఓ భవానీశంకర్

**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 26 :** భోగాపురం విమానాశ్రయ నిర్వాసి తులకోసం నిర్మిస్తున్న కాలనీల్లో అన్ని వసతులనూ కల్పిం చాలని విజయనగరం ఆర్‌డిఓ బిహెచ్ భవానీశంకర్ ఆదేశించారు. ;భోగాపురం విమానాశ్రయ నిర్వాసిత గ్రామాల సమస్యలపై తన కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్ ఇంజనీర్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

# వ్యర్థాలతో చేపల పెంపకం

**దేవరాపల్లి, వార్తావళి, ఆగస్ట్ 26 :** మండలంలోని తారువ, కలిగొట్ల, దేవరాపల్లి తామరబు తదితర ప్రాంతాల్లో కుళ్లిన వ్యర్థాలతో చేపలు పెంపకం గతంలో జరిగేది. దీనిపై స్థానిక రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై అధికారులు స్పందించి కుళ్లిన వ్యర్థాలు చేపలకు వేయకుండా అధికారులు నిలిపివేశారు. ఇప్పుడుమళ్ళి అధికారుల కళ్ళు కప్పి మళ్ళీ కుళ్లిన వ్యర్థాలతో క్యాట్ పిష్ చేపలు పెంపకం జరుగుతుంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# సంపాదకీయం

## ఆర్థిక వ్యవస్థ పతనం

'గత ఆరునెలలుగా దేశం ఎన్నో రకాల సంక్షోభాలను ఎదుర్కొంటోంది. కరోనా మహమ్మారి వేలాది మంది ప్రాణాలను బలిగొంది. ఆర్థిక వ్యవస్థ పతనోన్ముఖంగా సాగుతోంది. లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారు. పేదరికం రోజురోజుకూ పెరిగిపోతోంది. వీటన్నికి తోడు భారత భూభాగంలోకి చైనా ప్రవేశించి దురాక్రమణకు పాల్పడింది.' అని సోమవారంనాడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తన తీర్మానంలో పేర్కొంది. ఇలాంటి వాక్యాలు కమ్యూనిస్టు పార్టీల తీర్మానాల్లోనూ కనపడతాయి. ప్రతిపక్షంలో ఉన్నవారెవరైనా దేశంలో జరుగుతున్న పరిణామాల గురించి ఇట్లాగే వ్యాఖ్యానిస్తారు. కాని పరిస్థితులు ఇంత ఘోరంగా ఉంటే దేశంలో ప్రతిపక్షాలు ఎందుకు బలపడడం లేదు? ప్రతిపక్ష పార్టీలకు బలపడే శక్తి సామర్థ్యాలు కరువయ్యాయా? లేక ప్రజలు వాటిని ప్రతిపక్షాలుగా గుర్తించడం లేదా? వారు తమ పార్టీ సమావేశాల్లో వాస్తవాలనే ప్రస్తావిస్తున్నప్పటికీ ఎందుకు మొక్కుబడి తీర్మానాలుగా మిగిలిపోతున్నాయి? కాంగ్రెస్ పార్టీ తీర్మానాలు కూడా వామపక్ష పార్టీల తీర్మానాలుగా ఎందుకు కనపడుతున్నాయి? కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే ఆ పార్టీ ప్రవాహ శీలత కోల్పోయినట్లు కనపడుతోంది. లేదా కాలానికి ఎదురీదుతున్నట్లు కనపడుతోంది. నిజానికి వర్కింగ్ కమిటీ తీర్మానంలో ప్రస్తావించిన అంశాలనన్నిటినీ కాంగ్రెస్ యువ నేత రాహుల్ గాంధీ తరుచూ ప్రస్తావిస్తూనే ఉన్నారు. కొద్ది నెలలుగా ఆయన రోజూ నరేంద్రమోదీ పాలనపై మౌఖిక దాడులు చేస్తూనే ఉన్నారు. గత ఎన్నికల ముందు రాఫెల్ కుంభకోణంపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. పార్లమెంట్ సాక్షిగా అనేక ప్రశ్నలు లేవనెత్తారు. పార్టీ పరాజయం చెందిన తర్వాత కొంతకాలం దిగ్భ్రాంతికి లోనై నైతిక బాధ్యత వహించి పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినా మళ్లీ కోలుకుని విమర్శలను కురిపిస్తూనే ఉన్నారు. పిఎం కేర్స్ నిధి నుంచి ఫేస్‌బుక్‌తో బిజెపి మిలాఖత్ కావడం వరకూ రాహుల్ వ్యాఖ్యలు చేయనిరోజు లేదు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఒక ప్రతిపక్షంగా సంఘటితంగా బిజెపికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించలేకపోతున్నది. కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీతో గొంతు కలిపే సీనియర్ నేతలు అంతగా లేకపోవడం ఇందుకు ఒక కారణమైతే కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన నాయకుడంటూ కనపడకపోవడం మరో కారణం. అంతేకాదు, ఏ పరిస్థితినైనా తనకు అనుకూలంగా మలుచుకుని ప్రజల్లో తనపై అభిమానం చెక్కుచెదరకుండా ఉండేందుకు నరేంద్రమోదీ ప్రదర్శిస్తున్న గజకర్ణ గోకర్ణ విద్యలను తిప్పిగొట్టగల వ్యూహరచన కాంగ్రెస్ చేయకలేకపోవడం కూడా ఇంకొక కారణం. 2019 ఎన్నికల్లో రెండవసారి పరాజయం చెందడం మాత్రమే కాదు, కనీసం వంద సీట్లు కూడా దాటకుండా కేవలం 52 సీట్లకు పరిమితం కావడం కాంగ్రెస్‌ను కుదేలు చేస్తే పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుని రాహుల్ అస్త్రసన్యాసం చేయడం పార్టీని మరింత నైరాశ్యంలో ముంచేసింది. దీనికి తోడు పులిమీద పుట్ర లాగా భారతీయ జనతా పార్టీ వ్యూహకర్తలు ఆ పార్టీ ప్రభుత్వాలను కుప్పకూల్చడం, ఎమ్మెల్యేలను తమ వైపుకు తిప్పుకోవడం, సీనియర్ నేతల్ని సైతం ఆకర్షించడంతో పాటు కాంగ్రెస్ పునాదులను దెబ్బతీసేందుకు రకరకాల ఆయుధాలు ప్రయోగించడంతో పార్టీ అగమ్యగోచర పరిస్థితిలో పడింది. ఇదంతా ఒక ఎత్తు అయితే కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుత్సిత రాజకీయాలు ఆ పార్టీ వ్రేళ్లను చెదపురుగులుగా ఎప్పుడూ పట్టి పీడిస్తుంటాయి. పైకి ఆ పార్టీని గాంధీ కుటుంబం నడిపిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, అక్కడ నేతలు ఒకర్ని మరొకరు తొక్కేందుకు, ఒకరి కాళ్లను మరొకరు లాగేందుకు ప్రయత్నిస్తుంటారు. ఒక పదవి కోసం వందలాది మంది పోటీ పడుతుంటారు. పార్టీ అధిష్టానం ఒక నిర్ణయాన్ని తీసుకుంటే దాన్ని అమలు చేయకుండా ఉండేందుకు, చేసినా సాధ్యమైనంత మేరకు ఆలస్యం చేసేందుకు రాజకీయాలు సాగుతుంటాయి. ఏఐసిసి ముందు స్వీట్లు పంచిపెడుతూ, డప్పులు వాయిస్తూ వంధిమాగధత్వాన్ని నిస్సిగ్గుగా ప్రకటించేందుకు కార్యకర్తల్ని ప్రోత్సహించిన నేతలే తాము అనుకున్నది జరగకపోతే వెన్నుపోట్లకు సిద్ధపడిన సంస్కృతి కూడా కాంగ్రెస్‌లో మనకు కనపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కాంగ్రెస్ ఒక పార్టీ కాదు, రకరకాల ముఠాల, వర్గాల, దళారుల కూటమి. సోనియాగాంధీ చేతుల నుంచి రాహుల్ గాంధీ చేతుల్లోకి పగ్గాలు వచ్చే నాటికే కాంగ్రెస్‌లో ఈ పరిస్థితి నెలకొంది. 2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయి నప్పటికీ అప్పటికి రెండేళ్ల నుంచే కాంగ్రెస్ భవిష్యత్ పై కారుమేఘాలు కమ్ముకున్నాయి. అనారోగ్యంతో ఉన్న సోనియా సుదీర్ఘ కాలం విదేశాల్లో ఉన్న సమయంలో ఒక స్తబ్ధత నెలకొన్నది. నిజానికి అప్పటికే రాజకీయాల పట్ల నిరాసక్తంగా ఉన్న రాహుల్ పగ్గాలు చేపట్టేందుకు అంత ఆసక్తి ప్రదర్శించలేదు. దేశ రాజధాని అంతటా ప్రభుత్వ అవినీతిపై అన్నాహజారే ప్రభృతుల నిరసన ప్రదర్శనలు ముమ్మరంగా సాగుతున్నాయి. వామపక్షాలతో సహా మొత్తం ప్రతిపక్షాలన్నీ పార్లమెంట్‌లో సభను స్తంభింపచేసిన రోజులవి. నాడు సుష్మాస్వరాజ్ నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి వామపక్షాలు కూడా హాజరు కావడంతో బిజెపి మహదానందం పొందింది.

## చరిత్రలో ఆగస్ట్ 27 — సింగరాజు రామకృష్ణయ్య వర్ధంతి

ఎయిర్ ఇండియా దినోత్సవం

**1908 : ఆస్ట్రేలియా క్రికెటర్ డోనాల్డ్ బ్రాడ్‌మాన్ జననం.(మ.2001)**

**1955 : గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ మొదటి సంచిక ప్రచురించబడింది.**

**1957 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ జననం.**

**1963 : భారతీయ సినిమా నటి సుమలత జననం.**

**1972 : భారతీయ మల్లయోధ నిపుణుడు, నటుడు ది గ్రేట్ ఖలీ జననం.**


**1976 : హిందీ సినిమా నేపథ్య గాయకుడు ముకేష్ మరణం (జ.1923).**

**1995 : ఈటీవీ తెలుగు ప్రసారాలు (టి.వి. ఛానెల్) ప్రారంభమయ్యాయి.**

**2002 : ఉపాధ్యాయ ఉద్యమ రథసారథి, శాసన మండలి సభ్యుడు సింగరాజు రామకృష్ణయ్య మరణం (జ.1911).**

**2010 : ఆయుర్వేద, లైంగిక వ్యాధుల నిపుణుడు కంభంపాటి స్వయంప్రకాష్ మరణం (జ.1962).**

సింగరాజు రామకృష్ణయ్య (జూలై 1, 1911 – ఆగష్టు 27, 2002) ప్రముఖ ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) పేరుతో ఒక సంస్థను స్థాపించాడు. 1960 తర్వాత ఉపాధ్యాయ ఉద్యమం ప్రాంతాల వారీగా, యాజమాన్యాల వారీగా, కేడర్ల వారీగా చీలిపోయింది. టీచర్ల సమస్యలు పరిష్కారం కాక ఎక్కడివక్కడే ఉండిపోయాయి. అంతవరకు పొందిన రాయితీలు, సౌకర్యాలూ పోయాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై కనీసం ఉపాధ్యాయ సంఘాలని ఒకే వేదిక పైకి తెచ్చి సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో నిర్మాణానికి సింగరాజు కృషి చేశారు. ఫ్యాప్టో ఉపాధ్యాయుల ప్రయోజనాలను రక్షించడంతో పాటు, సాధించిన ఫలితాలు చారిత్రాత్మకమైనవి. సింగరాజు ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్– ఎపిటిఎఫ్–కు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రధాన కార్యదర్శిగా, రెండుదశాబ్దాలపాటు శాసనమండలి సభ్యులుగా, ఐక్య వేదికలైన యుఏసి, ఫ్యాప్టో, జెసిఇ, జేఏసి వంటి వాటిల్లో నాయకత్వ పాత్ర వహించి నిబద్ధతతో, ఆదర్శంగా పనిచేసి ఉన్నత ప్రమాణాలను నెలకొల్పారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి, హక్కులకోసం ఎనలేని కృషి సాగించారు. జాతీయ, అంతర్జాతీయ ఉపాధ్యాయ సంఘాలతో సంబంధాలు పెట్టుకోవడమే కాక వాటిల్లోను పాత్ర వహించి ఉపాధ్యాయుల ఆశయాలకోసం పనిచేశారు.



ఒకనాటి నెల్లూరు జిల్లాకు చెందిన కనిగిరి తాలూకా తలకొండపాడు గ్రామంలో (ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో ఉంది) సింగరాజు రామకృష్ణయ్య జూలై 1 1911 న జన్మించారు. తన ఏడవ ఏటనే తల్లిని కోల్పోయి చిత్తూరు జిల్లా కాళహస్తి లో ఉన్న పెత్తల్లి గారింటికి చేరారు. అక్కడే ప్రాథమిక పాఠశాలలో 3 వ తరగతిలో ప్రవేశించారు. పెద్దన్న అండతో ఎస్.ఎస్.ఎల్.సి వరకు చదువు పోర్తి చేశారు. విద్యార్థి దశలో తన చురుకుదనం, కుశాగ్రబుద్ధితో ఉపాధ్యాయుల, తోటి విద్యార్థుల అభిమానం చూరగొని తరగతి నాయకుడయ్యాడు. వార్షికోత్సవాల సందర్భంలో జరిగిన ఆంగ్లవ్యాస రచన, పద్య పఠనం పోటీలలో ప్రథమ బహుమతి సాధించారు. పెద్దన్న జాతీయవాది, స్వాతంత్ర్యోద్యమ అభిమాని కావడంతో వారి ప్రభావంతో ఖద్దరు వస్త్ర ధారన చేశారు. గాంధీజీ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సాగిన విదేశీ వస్త్ర బహిష్కరణ చేశారు. మద్యపాన వ్యతిరేక ప్రచారం, కల్లుదుకాణాల వద్ద పికెటింగ్ వగైరా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా యవ్వనం తొలిదశలోనే దేశభక్తిని అలవరచుకొని స్వచ్ఛందం సేవకుడుగా పరిణామం చెందారు. వారిది బీద కుటుంబం కావటంతో పై చదువులకు వెళ్లలేక నెల్లూరు సెకండారీ గ్రేడ్ ట్రైనింగ్ స్కూలులో ప్రవేశించారు. తన క్రియాశీలత వల్ల ఉపాధ్యాయుల, తోటి విద్యార్థుల గుర్తింపు పొందడమే కాక టీచర్ ప్యూపిల్ లీడర్స్ అసోషియన్ లీడర్ గా ఎన్నికై పలు కార్యక్రమాల్లో పాల్గొని వారికి అభిమానపాత్రుడయ్యాడు. ఉపాధ్యాయ శిక్షణ అనంతరం 1931 లో కాళహస్తి తాలూకా మోదుగుపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా నియామకమైనారు. తర్వాత నెల్లూరు జిల్లాకు వచ్చి, 1933లో పామూరు జిల్లా బోర్డు పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. అక్కడ నుండి పాతకమూరు, దర్శి పాఠశాలల్లో 1947 వరకు పనిచేశారు. పై మూడు ప్రదేశాలలోనే ఆదర్శ ఉపాధ్యాయునిగా బాధ్యతలు నిర్వహించడమే గాక సంఘసేవా కార్యక్రమాలు కూడా సాగించారు. పాతకమూరులో బీద విద్యార్థుల వసతి గృహం యేర్పాటు చేశారు. దర్శిలో స్థానిక అధికారుల సహకారంతో తాలూకా భవన నిర్మాణానికి కృషిచేశారు. క్లబ్ కార్యదర్శిగా, స్థానిక కో ఆపరేటివ్ స్టోర్సు కార్యదర్శిగా పనిచేశారు. వారికి సంగీతంలో నాటకాలలో అభిరుచి కారణంగా కొన్ని సాంఘిక నాటకాల ప్రదర్శనకు కృషిచేశారు. వాటిల్లో కొన్ని పాత్రలు కూడా దర్శించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో కాంగ్రెస్ జిల్లా బోర్డు ఆదేశం ప్రకారం పాతకమూరు పాఠశాల స్టాఫ్ బుక్ లో మూసివేసినట్లు నమోదు చేసి ధైర్యంగా తన దేశభక్తిని ప్రదర్శించారు. ఆ జిల్లాలో అలా మూసివేసిన స్కూలు అది మాత్రమే కావటం విశేషం. 1948 లో చెన్నుపాటి లక్ష్మయ్య నాయకత్వాన గుంటూరులో టీచర్స్ ఫెడరేషన్ పునరుద్దరణ జరిగినపుడు అందులో సభ్యత్వాన్ని స్వీకరించటమే కాక దర్శి తాలూకా ప్రదాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 1948 లో ఉపాధ్యాయ పత్రిక సంపాదక వర్గ సభ్యులుగా పత్రికా నిర్వహణలో పాల్గొన్నారు. 1948 లో కనిగిరి తాలూకా మహాసభలో విద్యాశాఖాధికారి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఆనాతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మాణిక్యాంబ, సింగరాజు గార్ల నాయకత్వంలో వందలాది మంది ఉపాధ్యాయులను సమీకరించి, సాగించిన ఉద్యమం "సెభాష్ కనిగిరి" ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో ఉజ్వల ఘట్టంగా నిలిచించి. ఈ ఉద్యమమే సింగరాజు గారి ఉపాధ్యాయ ఉద్యమ జీవితానికి మలుపు తిప్పింది. 1949 లో నర్సారావు పేటలో జరిగిన ఎ.పి.టి.యఫ్ జనరల్ కౌన్సిల్ సమావేశం ప్రథమంగా సింగరాజు గారిని ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఆనాటి నుండి ఏ.పి.టి.యఫ్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగి 1992 లో విజయవాడలో జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. 1949 నుండి 1992 వరకు ఎ.పి.టి.యఫ్‌కు ప్రధాన కార్యదర్శిగా 43 సంవత్సరాల పాటు పనిచేశారు. 1947 లో ఏపిటియఫ్ ఆవిర్భావం నుండే ఫెడరేషన్ సభ్యులుగా చేరి నెల్లూరు జిల్లా దర్శి తాలూకా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు 1947 లో ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా వున్నపుడు వేతనాల పెంపుదల తలపెట్టిన సమ్మె కార్యక్రమాలల్లో ఉధృతంగా పనిచేశారు. ఉపాధ్యాయుల వాణిని బలంగా వినిపించేవారు.

# దశరథుని సంతాపం

(నిన్నటి తరువాయి)




ఎంత మాటన్నావు తండ్రీ అన్నట్టుగా దీర్ఘంగా నిట్టూర్చి కళ్ళు మూసుకున్నాడు రాముడు. తర్వాత కళ్ళు తెరిచాడు. తండ్రిని చూస్తూ అన్నా డిలా."నీ మాట నిలబడాలి తండ్రీ! నా కోసం నువ్వు మాట తప్పడం నేను భరించలేను."లేచి నిల్చున్నాడు రాముడు. తల్లుల నూ, మంత్రి సామంతులనూ చూశాడు. తండ్రిని చూసి చెప్పాడిలా."నీ సమక్షంలో ప్రమాణం చేసి చెబుతున్నాను, దయచేసి నా మాటలు విను తండ్రీ! నువ్వు నన్ను యువరాజుని చేస్తానంటే రాజ్యంపైగాని, భోగాలపైగాని మమకారంతో నేను అందుకు అంగీకరించలేదు. నువ్వు ఆజ్ఞాపించావు. నేను అంగీక రించాను. అంతే! తండ్రి ఆజ్ఞ పరమేశ్వరాజ్ఞతో సమానం. అందుకే నీ ఆజ్ఞను అనుసరించే ఇప్పుడు కూడా ఈ వనవాసదీక్షకు పూనుకున్నాను. నువ్వు ఆదే శించినట్టుగా పద్నాలుగేళ్ళూ దండకలో నివసించి, తర్వాతే నీ పాదసేవకు సిద్ధమవుతాను. నన్ను ఆశీర్వదించు."“ఆలస్యం దేనికి? ఆశీర్వదించండి మహారాజా." అన్నది కైకేయి. వెనుగ్గా ఉన్న ఆమె మంధరసహా ముందుకొచ్చింది. ఆమెను అసహ్యించు కుంటూ ముఖాన్ని తిప్పుకున్నాడు దశరథుడు. రాముడితో అన్నాడిలా."ధర్మమూర్తివి, సత్యసంధుడివి, నీ నిర్ణయం మార్చడం నావల్ల కాదుగాని, నువ్వు నా కుమారుడివి అయినందుకు ఆనందించాలో, దుఃఖిం చాలో తెలియడం లేదు."“తండ్రి మాట నిలబెడుతున్న తనయుణ్ణి చూసి ఆనందించి, అభినందించాలి మహారాజా! దుఃఖించడం అవివేకం. దుఃఖించకండి." అన్నది కైక. మంధరను చూసింది. మాబాగా చెప్పావు అన్నట్టుగా నవ్వుతూ తలూపింది మంధర. చేతిలోని కర్రను ఎగరేసి, అందుకుని ముద్దుపెట్టుకుంది. 'సర్వసౌఖ్యాలనూ తృణప్రాయం చేసి, వనవాసానికి సిద్ధమయ్యావు చూడూ, నీకు నువ్వేసాటి." అన్నాడు దశరథుడు.ఆ మాటకి కైకా, మంధరలు ఒకరిని ఒకరు సన్నగా నవ్వుతూ చూసుకున్నారు."రామా! ప్రమాణపూ ర్వకంగా చెబుతున్నాను, ఈ పాపం అంతా ఇదిగో, ఈ కైకదే! నాకేం తెలీదు." అన్నాడు దశరథుడు. ఆ మాటకి మహారాజును కోపంగా చూసింది కైక."శ్రీరామా! ఈ భూమీ, ఆ ఆకాశం నిలిచేంత వరకూ నీ కీర్తి కూడా నిలిచి ఉంటుంది. నీకు తోడునీడగా నిలిచిన ఈ సీతాలక్ష్మణులను కూడా మనసారా ఆశీర్వదిస్తున్నాను. మీ వనవాసదీక్ష అనాయాసంగా ముగుస్తుంది. ముగియాలని కోరుకుంటున్నాను. పద్నాలుగేళ్ళూ అరణ్యవాసం పూర్తి చేసుకుని, మీరు అయోధ్యకు తిరిగి వస్తారు. అను మానం లేదందులో." అన్నాడు దశరథుడు. కైకను చూశాడప్పుడు. తల తిప్పుకుందామె. "ఇక నాకు శలవు." అన్నాడు రాముడు. అడుగు ముందుకు వేయబోయాడు. వారించాడతన్ని దశరథుడు. "నాయనా, నాదో చిన్నకోరిక."“చెప్పండి తండ్రీ."“ఈ పూటకు మీ ప్రయాణాన్ని విరమించుకోండి. ఈ రాత్రి మాతో హాయిగా ఆనందంగా గడపండి. సర్వసౌఖ్యాలూ అనుభవించండి. మిమ్మల్ని చూసుకుంటూ ఈ రాత్రి నేను కూడా ఆనందంగా గడిపే అదృష్టాన్ని కలుగ జేయండి." వేడుకున్నాడు దశరథుడు. ఆ వేడుకోలును భరించలేనట్టుగా చూసింది కైక. అది గమనించాడు రాముడు. తండ్రితో అన్నాడిలా."నన్ను మన్నించు తండ్రీ! ఇప్పుడు నువ్విలా వేడుకోవడం హర్షించరానిది. నువ్వు ఈ రాత్రి ప్రసాదిస్తానన్న సర్వసౌఖ్యాలు నేను అనుభ వించాననుకో! ఆనందించు. నన్ను వెళ్ళిరానీ."గుండెల మీది భారం ఏదో తొలగినట్టయి, ఊపిరి పీల్చుకుంది కైక."ఇక వేరే ఆలోచన పెట్టుకోక, ఈ సమస్త సామ్రాజ్యాన్నీ సోదరుడు భరతునికి ప్రసాదించు తండ్రీ, అతడు అన్ని విధాలా యోగ్యుడు. ఉత్త ముడు." అన్నాడు రాముడు. తల వంచుకుని విన సాగాడు దశరథుడు. "తండ్రీ నా ఈ వనవాసం సీతాలక్ష్మణుల సహాయసహకా రాలతో హాయిగా ఆనందంగా గడుస్తుంది. అరణ్యాలలో పర్వతాలూ, నదీనదాలూ, మృగాలను చూస్తూ, పరవశించిపోతాను. అక్కడి సిద్ధులూ, యోగులూ, రాజర్షులూ, మహర్షులను చూసి పొంగిపోతాను. పర్ణశాలల్లో పవళించి, కందమూలాలూ, ఫలాలూ ఆరగిస్తూ పద్నాలుగేళ్ళూ ఇట్టే గడిపేస్తాను. అనంతరం నీ కోరిక, నా తల్లి కౌసల్య కోరిక మేరకు నేను అయోధ్యకు తిరిగి వస్తాను. ఇక నాకోసం, ఈ సీతాలక్ష్మణుల కోసం మీరెవరూ చింతించనవసరం లేదు." అన్నాడు రాముడు. అడుగు తీసి అడుగు వేయ బోయాడు. వారిస్తున్నట్టుగా అతన్ని గట్టిగా కౌగిలించు కున్నాడు దశరథుడు. కన్నీరుపెట్టుకున్నాడు. సొమ్మసిల్లి పోయాడు. మహారాజు సొమ్మసిల్లి చేష్టలుడిగిపోవడాన్ని తట్టుకోలేకపోయాడు సుమంత్రుడు. మహా రాజా! మహారాజా అంటూ అతనూ మూర్ఛపోయాడు. ఇటు రాజూ, అటు మంత్రీ ఇద్దరూ మూర్ఛపోవడాన్ని చూసి అక్కడ ఉన్నవారంతా హాహాకారాలు చేశారు. కైకకు అంతుచిక్కలేదేదీ. మంధరను సమీపించిందామె. సన్నగా వణికిపోసాగింది. ధైర్యం చెబుతున్నట్టుగా కైక చేయిని అందుకున్నది మంధర. గట్టిగా పట్టుకుని నిల్చింది.

**కైకను మందలించిన సుమంత్రుడు**

సీతాలక్ష్మణులసహా రాముడు వనవాసానికి బయల్దేరాడు. రాముడు వనవాసానికి వెళ్ళిపోతున్నాడన్నది తట్టుకోలేకపోయాడు.

(మిగతా రేపటి సంచికలో)

# 'సుఖదుఃఖ సమభావన' ఎందుకంటే?



'యం హి నవ్యథ యంత్యేతే పురుషం పురుషర్షభ సమదుఃఖ సుఖం ధీరం సో మృతత్వాయ కల్పతే ?

'పురుష శ్రేష్ఠుడవైన ఓ అర్జునా..!'

'సుఖదుఃఖాలను సమానంగా భావించే ఏ ధీరుణ్ణైతే ఇంద్రియ చాపల్యాలు పీడింపలేవో అతడే మోక్షప్రాప్తికి అర్హుడు.' శ్రీకృష్ణ భగవానుని ఈ ప్రబోధాన్ని పరిశీలిస్తే ధీరుడైన వాని దృష్టిలో సుఖదుఃఖాల సమభావన విధిగా ఉంటుందన్న విషయం అర్థమవుతుంది. మానవ జీవితంలో కష్టసుఖాలు తప్పవు. కష్టాల్లో కుంగిపోయి, సుఖాల్లో పొంగి పోవడమన్నది లోకంలో సాధారణంగా మనకు కనిపించే ధోరణి. కానీ, 'భగవద్గీత' బోధిస్తున్న పై అంశం ప్రకారం 'ఆ రెండింటినీ సమదృష్టితో చూడాలి'. ఇది నిజానికి సామాన్యులకు చాలా కష్టం. అలాగని స్థిరచిత్తం గల మనిషికి అసాధ్యం మాత్రం కాదు. ఎంతటి కఠినమైన అంశమైనా సాధనతో సుసాధ్యమవుతుంది. కఠోర సాధన అనేకమైన అసాధ్యాలను మనకు చేరువ చేస్తుందన్నది నిరూపిత సత్యం కూడా. దాని ఆచరణ కోసమే ప్రతి ఒక్కరూ తమ సర్వ ప్రయత్నాలనూ కొనసాగించాలి. ఆ దిశగా మన గమ్యం నిర్దేశింపబడాలన్నదే భగవంతుని బోధనలోని పరమార్థం. భారతీయ సనాతన ధర్మం బోధిస్తున్నది కూడా పురుషార్థాలను అచరించే జీవన విధానాన్నే! ఈ ఆచరణ వ్యక్తిగతంగా తనకు, సామాజికంగా ప్రజాబాహుళ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంద న్నది తిరుగులేని వాస్తవం. ఇది చెప్పింది ధర్మప్రవక్తలే అయినా ఇది సార్వకాలిక సత్యం కూడా. 'ధర్మమార్గంలోనే అర్థ (ధన) సంపాదన చేసి, కామిత వాంఛలను పూర్తి చేసుకొని, మోక్షాన్ని సాధించాలన్నది ఇందులోని సందేశం. దీనిని ఆచరణలో పెట్టినవాడినే 'పూర్ణ పురుషుడని, ధీరుడని' మన శాస్త్రాలు పేర్కొన్నాయి. అటువంటి స్త్రీ పురుష లందరికీ సుఖదుఃఖాల విషయంలో సమభావన ఉండాలి. అప్పుడే అంతిమ లక్ష్యమైన 'మోక్షం' సాధ్యమవుతుంది. ఆ సమభావన కలిగినవారే ఈ మార్గంలో పురోగతిని, విజయాలను సాధించి, సూర్యచంద్రాదులు న్నంత కాలం కీర్తిప్రతిష్ఠలను నిలుపుకొంటారు. భారతీయ పురాణేతిహాసా లన్నీ ఇటువంటి మహానుభావుల గుణాలనే గానం చేశాయి. అందుకే, ధీరులైన వారెప్పుడూ ఏ మోహంలోనూ చిక్కుకోరాదు. అది సుఖం కావచ్చు, దుఃఖం కావచ్చు. ఈ విషయంలో మనకు రామాయణ కావ్య నాయకుడైన శ్రీరామచంద్రమూర్తియే గొప్ప ప్రమాణం. శ్రీరాముడు 'తనకు పట్టాభిషేకం జరుగబోతుందని తెలిసినప్పుడైనా, తర్వాత అది భంగమై తాను అడవులకు వెళ్లవలసి వచ్చిందని విన్నప్పుడైనా.. ఈ రెండింటినీ సమభావనతో చూడగలిగే ధీరత్వాన్ని ప్రదర్శించాడు. ధర్మాచణలో ఏ మాత్రం చలించనివాడు గనుకనే భార్యకు దూరమైనా, వానరులను కలుపుకొని రావణ సంహారంతో దుష్టశిక్షణలో విజయం సాధించగలిగాడు. 'అన్ని భావాలను సమదృష్టితో చూడగలిగిన ధీరుడే విజయాలు సాధిస్తాడన్న' దానికి ఇదొక గొప్ప ప్రతీక. అందుకే, పురుషోత్తముడైన శ్రీరాముడు తిరుగులేని దైవంగా మనందరి గుండెల్లో నిలిచిపోయాడు. జీవితంలో ప్రతి మనిషికీ అనేక కష్టాలు వస్తుంటాయి. వాటిని అధిగమించి విజయాన్ని పొందే మార్గంలో స్థిరత్వాన్ని కోల్పోకుండా, ధీరులమై నిలువాలన్న గొప్ప సందేశం ఇందులో ఉమిడి వుంది. ఈ దృష్టి పాదుకొనడానికి ప్రతి ఒక్కరికీ మానసిక దృఢత్వం ఎంతో అవసరం.

**'మాత్రా స్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ఆగమాపాయినో నిత్యాః తాం స్తితీక్షస్వ భారత'?**

'మనిషికి ఇంద్రియాల స్పర్శ ఉన్నంత కాలం శీతోష్ణాలు, సుఖదుఃఖాలు తప్పక ఉంటాయి. అవి రావడం, పోవడం కూడా ఉంటుంది. కాబట్టి, వాటిని అశాశ్వతాలని తెలుసుకొని, సమభావనతో ధీరుడై విజయాన్ని సాధించి, మోక్షం పొందాలి..' అని బోధించి మార్గనిర్దేశనం చేసిన శ్రీకృష్ణ పరమాత్మ మనలనందరినీ ధన్యులను చేశాడు.

## గుప్పెడు వాల్‌నట్స్ తినడం వల్ల ఏం జరుగుతుందో తెలుసా? ఆ సమస్యకు దూరం!



అందరినీ అనారోగ్యానికి దారితీసే వ్యాధి డయాబెటిస్. ఇది వయసుతో సంబంధం లేకుండా అందరికీ వస్తున్నది. షుగర్ వ్యాధి రావడం వల్ల నచ్చిన ఆహారం తినడానికి కూడా వీలు పడదు. చక్కెర వస్తువులు అసలే తినకూడదు. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, చెడు అలవాట్ల వలనే డయాబెటిస్‌కు గురవుతున్నారంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఒకసారి షుగర్ వ్యాధి వస్తే జీవితాంతం దానిని అనుభవిస్తూ ఉండాలి. శరీరానికి సరైన ఇన్సులిన్ అందక అస్వస్థకు గురవుతారు. బాడీలో షుగర్ లెవల్స్ ఎలా ఉన్నాయో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. డయాబెటిస్ టైప్–2 బారిన పడినవారు వాల్‌నట్స్ తినడం వల్ల బయట పడొచ్చు. రోజుకు 3 టేబుల్ స్పూన్ల వాల్‌నట్స్ తీసుకోవడం వల్ల 47 శాతం తగ్గుతుందని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు వెల్లడించారు. మధుమేహం ఒకటే కాదు కరోనా టైంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి కూడా వాల్‌నట్స్ ఎంతో ఉపయోగపడుతాయి. మరింకెందుకు ఆలస్యం వాల్స్‌నట్స్ తిని ఆరోగ్యంగా ఉండండి.

చదవడం వలన ప్రయోజనమేమంటే నలుమూలల నుంచి వచ్చే విజ్ఞానాన్ని పొందడం, దాన్నుంచి గుణ పాఠాలు తీసుకోవడం...



– మహాత్మా గాంధీ

ఆ.వె.
పతితననుబయటకుపంపించి వేశినా,
కన్నవారుతననుకాదనినను',
ఒరిమిగను చదివి
యొకయస్స యైయిన
పదవి నొందె నాదు
పడతి జూడ



– మల్లాది సోమేశ్వర శర్మ, 9603995769

### ప్రేమే మార్గం...సేవేలక్ష్యం!

మౌనం యొక్క ఫలితం ప్రార్ధన!
ప్రార్థన యొక్క ఫలితం నమ్మకం!
నమ్మకం యొక్క ఫలితం ప్రేమ!
ప్రేమ యొక్క ఫలితం సేవ!
సేవ యొక్క ఫలితం సంతృప్తి!
ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా
నవ్వగలి గితే...అదే వారికి నివ్వచ్చే
అందమైన బహుమతి...!



నగేష్ వర్మ విశాఖపట్నం

# పవర్ స్టార్ సంపాదన శృతి



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ – నటుడు నిర్మాత బండ్ల గణేష్ కి మధ్య ప్రత్యేకమైన అనుబంధం ఉంది. కమెడియన్ స్థాయి నుండి స్టార్ ప్రొడ్యూసర్ స్థాయికి ఎదిగిన బండ్ల గణేష్ పవన్ కళ్యాణ్ తో 'తీన్ మార్' సినిమా నిర్మించాడు. ఈ సినిమా పరాజయం పాలైనా పవన్ పిలిచిమరీ 'గబ్బర్ సింగ్' సినిమాకి ప్రొడ్యూసర్ గా బండ్ల గణేష్ కి బాధ్యతలు అప్పగించారు. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా సూపర్ హిట్ అందుకుంది. అప్పటివరకు పవన్ కళ్యాణ్ కెరీర్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా.. పవన్ కళ్యాణ్ ని ఫ్లాపుల నుంచి బయటపడిన సినిమాగా నిలిచింది. ఇక ఈ సినిమాతో హరీష్ శంకర్ స్టార్ డైరెక్టర్ గా మారిపోయాడు.. ఐరన్ లెగ్ గా ముద్రపడిన శృతి హాసన్ సక్సెస్ఫుల్ హీరోయిన్ అనిపించుకుంది. కాగా 'గబ్బర్ సింగ్' సినిమాలో హీరోయిన్ గా శృతి హాసన్ ని తీసుకోవమని పవన్ కళ్యాణ్ సూచించాడట. అప్పటికే తెలుగులో 'అనగనగా ఓ ధీరుడు' 'ఓ మై ఫ్రెండ్' వంటి ఫ్లాప్ చిత్రాలలో నటించిన శృతి హాసన్ కి టాలీవుడ్ లో ఐరన్ లెగ్ అనే ముద్ర పడిపోయింది. అయితే పవన్ మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా శృతి నే హీరోయిన్ గా రికమెండ్ చేశారట. అంతేకాకుండా ప్రొడ్యూసర్ బండ్ల గణేష్ పవన్ కళ్యాణ్ తో 'శృతి హాసన్ ఫ్లాపుల్లో ఉందని.. అందుకే ఈ అమ్మాయి మనకు వద్దని' అన్నాడట. అయితే దానికి పవన్ కళ్యాణ్ 'నువ్వు నేను ఏమైనా అన్నీ సూపర్ హిట్స్ ఇచ్చామా?' అని నవ్వుతూ సమాధానం ఇచ్చాడట. ఈ సినిమా శృతి హాసన్ కెరీర్ కి ఎంతటి ప్లస్ అయిందో అందరికి తెలిసిందే. ఇకపోతే శృతి హాసన్ ఆ తర్వాత పవన్ కళ్యాణ్ తో 'కాటమరాయుడు' సినిమాలో నటించింది. అంతేకాకుండా ప్రస్తుతం పవన్ నటిస్తున్న 'వకీల్ సాబ్' సినిమాలో కూడా కీలక పాత్రలో నటిస్తోంది.


# ఆమె బయోపిక్‌లో నటించాలని ఉంది..!



ఈ మధ్య కాలంలో బయోపిక్‌ల హవా బాగానే నడుస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, తమిళ్ ఇలా పలు ఇండస్ట్రీల్లో ఇప్పటికే ఎంతో మంది బయోపిక్ లు తెరకెక్కాయి. పలువురు సినీ ప్రముఖులు, రాజకీయనేతలు, క్రీడా ప్రముఖులు ఇలా చాలా మంది జీవిత చరిత్రలే తెరకెక్కాయి. ఇంకా చాలా మంది బయోపిక్ లు లైన్ లో వున్నాయి. ఇదిలా ఉండగా తనకు కూడా ఒక వెటరన్ యాక్ట్రెస్ బయోపిక్ లో నటించాలని ఉంది అంటుంది టాలెంటెడ్ యాక్ట్రెస్ ఐశ్వర్య రాజేష్. ఇంతకీ ఐశ్వర్య రాజేష్ నటించాలనుకున్న హీరోయిన్ ఎవరనుకుంటున్నారా..? ఆమె ఎవరో కాదు నటి మనోరమ. దివంగత నటి మనోరమ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. తమిళంతోపాటు తెలుగులో కూడా పలు సినిమాల్లో నటించారు మనోరమ. దాదాపుగా 1500కు పైగా సినిమాల్లో ఆమె నటించారు. ఐదువేలకు పైగా నాటకాలు వేశారు. అలాగే, పలు టీవీ సీరియల్స్‌లో కనిపించారు. ఎన్నో గొప్ప సినిమాల్లో నటించిన మనోరమ 78 ఏళ్ల వయసులో 2015లో కన్నుమూశారు. అలాంటి నటి మనోరమ బయోపిక్‌లో నటించాలని ఉందని.. ఆమె పాత్రలో నటించి జాతీయ స్థాయిలో అవార్డు పొందాలని ఆశపడుతున్నానని, అది త్వరలో నెరవేరాలని కోరుకుంటున్నానని తెలుపుతుంది ఐశ్వర్య రాజేష్. మరి త్వరలోనే ఐశ్వర్య రాజేష్ కల నెరవేరాలని కోరుకుందాం. కాగా విభిన్నమైన కథలతో.. తన నటనతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది ఐశ్వర్య రాజేష్. ప్రస్తుతం 'భూమిక' అనే తమిళ చిత్రంలో నటిస్తోంది ఐశ్వర్య రాజేష్. ఈ చిత్రానికి రతీంద్రన్ ఆర్.ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. కార్తీక్ సుబ్బురాజ్, సుదన్ నిర్మిస్తున్న ఈ సినిమాలో ఐశ్వర్యా రాజేష్ సైక్రియాటిస్టు పాత్రలో నటిస్తోంది.


# ఇలానే తిరుగుతాం..


సౌత్ సినిమా ఇండస్ట్రీలో నయనతార ఒక స్టార్ హీరోయిన్ గా సేఫ్ జోన్ లో చక్రం తిప్పుతోంది. తనకు తానే పోటీ అనేలా మిగతా హీరోయిన్స్ ని ఒక విధంగా డామినేట్ చేస్తోందనే కామెంట్స్ వస్తున్నాయి. తనపై ఎన్ని విమర్శలు వచ్చినా కూడా ఆమె కనీసం తిరిగి కూడా చూడదని అందరికి తెలిసిన విషయమే. ఇక ఆమె పెళ్లిపై అనేక రకాల వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. రీసెంట్ గా ఆమె బాయ్ ఫ్రెండ్ విగ్నేష్ పెళ్లిపై ఎవరు ఊహించని విధంగా కామెంట్ చేశారు.సాధారణంగా నయనతార మీడియాకు దూరంగానే ఉంటుందని అందరికి తెలిసిందే. ఇక సినిమాలకు సంబంధించిన ప్రమోషన్స్ ఈవెంట్స్ లలో కూడా ఆమె పాల్గొనదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కానీ ఆమె ప్రస్తుత ప్రియుడు విగ్నేష్ మాత్రం అందుకు కాస్త భిన్నంగా ఉంటాడు. రూమర్స్ గురించి పెద్దగా పట్టించుకోడు గాని నయనతారతో ఉన్న రిలేషన్ పై మాత్రం ప్రతి ఇంటర్వ్యూలో స్పందిస్తూనే ఉంటాడు.ఇక రీసెంట్ గా పెళ్లిపై కాస్త ఎక్కువ ప్రశ్నలు ఎదురవ్వడంతో విగ్నేష్ స్పందించక తప్పలేదు. నయనతార విగ్నేష్ శివన్ ఒక పురాతనమైన గుడిలో పెళ్లి చేసుకోబోతున్నారని నయనతార తన సన్నిహితుల సహాయంతో పెళ్లికి ముందే ఒక భారీ హోమం చేయబోతున్నట్లు టాక్ వచ్చింది. ఆ విషయాలపై వారిద్దరు ఇంతవరకు స్పందించలేదు. కానీ పెళ్లిపై విగ్నేష్ ఈ విధంగా వివరణ ఇచ్చారు. ఆ దర్శకుడు మాట్లాడుతూ.. మేమిద్దరం మా పనులతో చాలా బిజీగా ఉన్నాం. నేను నా డైరెక్షన్ వర్క్ తో బిజీగా ఉంటే నయన్ హీరోయిన్ గా తీరిక లేకుండా కష్టపడుతోంది. ఇంకా మేము చాలా సాదించాల్సి ఉంది. ఒకవేళ డేటింగ్ బోర్ కొడితేనే పెళ్లి చేసుకోవాలనే నిర్ణయం తీసుకుంటాం. అంతవరకు ఇలానే ఉంటామని విగ్నేష్ వివరణ ఇచ్చారు. విగ్నేష్ ఇచ్చిన క్లారిటీతో ప్రస్తుతం వారు పెళ్లి గురించి అంతగా ఆలోచించడం లేదనే తెలుస్తోంది. గతంలో నయన్.. శింబు, ప్రభుదేవాను ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి సిద్ధమవుతున్న చివరి నిమిషంలో విడిపోయిన విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు విగ్నేష్ శివన్ ని ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని నయన్ రెడీ అవుతున్నట్లు సమాచారం.




# దుమ్ములేపుతోన్న అఖిల్

అక్కినేని అఖిల్.. విజయం కోసం పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అఖిల్, హలో, మిస్టర్ మజ్ను ఏవీ కూడా అఖిల్‌కు సక్సెస్‌ను అందించలేకపోయి. తండ్రి నాగ్ మద్దతు ఉన్నా కూడా సినిమాలేవీ వర్కౌట్ కావడం లేదు. విక్రమ్ కే కుమార్, వెంకీ అట్లూరి వంటి వారు కూడా అఖిల్‌కు విజయాన్ని కట్టబెట్టలేకపోయారు. అయితే ఈ సారి మాత్రం ఎలాగైనా హిట్టు కొట్టాలనే కసితో వస్తున్నాడు. బొమ్మరిల్లు సక్సెస్ కొట్టిన భాస్కర్.. అఖిల్‌ను మోస్ట్ ఎలిజబుల్ బ్యాచ్‌లర్‌గా చూపించబోతోన్నాడు. అయితే ఈ సినిమా ఈ ఇద్దరికీ సవాల్ వంటిదే. అసలే రాక రాక వచ్చిన అవకాశాన్ని బొమ్మరిల్లు భాస్కర్ ఉపయోగించుకుని సక్సెస్ అవుతాడో లేదో చూడాలి. మామూలుగా అయితే ఈ పాటికే అఖిల్ మోస్ట్ ఎలిజబుల్ బ్యాచ్‌లర్ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావాల్సింది. కరోనా కారణంగా అంతా తారుమారైంది. ఇటీవలె విడుదల చేసిన ఓ పోస్టర్‌కు విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. పూజా హెగ్డే తన కాళ్లను అఖిల్‌పై వేయడం అందర్నీ ఆకట్టుకుంది. ఇక తాజాగా అఖిల్ తనలోని కొత్త యాంగిల్‌ను చూపించేందుకు సిద్ధమయ్యాడు. ఈ మేరకు జిమ్‌లో తెగ కష్టపడి బాడీని పెంచేస్తున్నాడు. ఈ సందర్భంగా అఖిల్ పోస్ట్ చేస్తూ.. 'ఇక నా ఆట, ఇంటెన్సిటీ, హార్డ్ వర్క్‌ను మరో లెవెల్‌కు తీసుకురావాల్సిన సమయం వచ్చింది.. నాలో ఉన్న ఇంటెన్సిటీ, హార్డ్ వర్క్.. నా జీవితంలో కొత్త దశ ప్రారంభం అయింది.. నాలో వచ్చిన ఈ మార్పే నా జీవితంలో అన్నింటి కంటే ప్రత్యేకమైంది. ఇది నా జీవితంలో ఎన్నో మార్పులను తీసుకురాబోతోంది. ఇంకా ఎన్నెన్నో రాబోతోన్నాయి' అంటూ చెప్పుకొచ్చాడు.





# బెలూన్స్ బిజినెస్‌పై సీరియస్ అయిన హాటీ



తెలుగు మరియు తమిళంలో పలు చిత్రాల్లో నటించి మెప్పించిన ముద్దుగుమ్మ హన్సిక గత రెండు మూడు సంవత్సరాలుగా ఎక్కువగా ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అవుతోంది. లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేయడంతో పాటు ప్రాముఖ్యత లేని పాత్రలు చేస్తు ఉండటంతో ఈమె కెరీర్ ముగిసినట్లే అంటున్నారు. ఈ సమయంలో ఈమె ఒక బిజినెస్ ప్రారంభించింది అంటూ ఒక తమిళ మీడియా సంస్థ ఒక కథనం ప్రసారం చేసింది. దాంతో హన్సికకు కోపం వచ్చింది. ఇంతకు ఆ బిజినెస్ ఏంటో తెలుసా.. బెలూన్స్ బిజినెస్. ఫంక్షన్స్ మరియు ఇతర కార్యక్రమాలకు డెకరేషన్ కోసం ఈమె బెలూన్స్ సరఫరా చేస్తుంది అంటూ ఒక ఫన్నీ కథనంను వారు అల్లడం జరిగింది. బెలూన్స్ బిజినెస్ లో హన్సిక బంధువులు ఉన్నారట. దాంతో ఆమె కూడా అదే బిజినెస్ లో దిగాలని నిర్ణయించుకుని మొదలు పెట్టింది అంటూ ఆ కథనంలో పేర్కొనడం జరిగింది. అయితే ఆ వార్తలపై హన్సిక సీరియస్ అయ్యింది. ట్విట్టర్ లో ఆ కథనంపై స్పందించిన హన్సిక సదరు మీడియా సంస్థకు కౌంటర్ ఇచ్చింది. నేను ఎలాంటి వ్యాపారం చేయబోతున్నాను అనే విషయంలో మీ ఆలోచనకు పదును పెట్టినందుకు థ్యాంక్స్. నిజంగా ఈ వార్త నాకు క్రాక్ తెచ్చేలా ఉంది. నేను ఊహించని దాని గురించి మీరు ఆలోచించారు. అది నాకు ఆశ్చర్యంగా ఉందంటూ ఆమె కామెంట్స్ చేసింది. మొత్తానికి తను ఎలాంటి బిజినెస్ లు చేయడం లేదు సినిమాలతోనే ఇంకా బిజీగా ఉన్నట్లుగా చెప్పే ప్రయత్నం చేసింది.

# కథానాయికల చూపు ఓటీటీల వైపు..



కథానాయికల చూపు ఓటీటీల వైపు మళ్లుతోంది. భవిష్యత్ అంతా ఈ రంగంలో ఉందనేది ఇప్పటికే స్పష్టం అయిపోవడంతో చాలా మంది టాలీవుడ్ కథానాయికలు తెలివిగా ఆలోచిస్తున్నారు. ఇప్పటికే సమంత.. అమలాపాల్ .. నిత్యామీనన్ లాంటి భామలు ఓటీటీల్లో నటిస్తున్నారు. వీళ్ల బాటలోనే దిల్లీ బ్యూటీ రాశీ ఖన్నా కూడా ఓటీటీ డీల్ మాట్లాడుకుందని తెలుస్తోంది. వెంకీ మామ –ప్రతి రోజూ పండగే సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ చూసిన తరవాత స్టార్ హీరోయిన్ గా నెక్స్ట్ లెవల్ అందుకునేందుకు రాశీఖన్నా రకరకాల ప్రణాళికల్ని సిద్ధం చేస్తోంది. ఇంతలోనే క్రైసిస్ ఇలా చెక్ పెట్టేసింది. ఈ సంవత్సరం ప్రారంభంలో విడుదలైన వరల్డ్ ఫేమస్ లవర్ తో వైఫల్యాన్ని ఎదుర్కోవడం మైనస్ అయ్యింది. ప్రస్తుతం ఈ భామ తెలుగు – తమిళ రెండింటిలో కొన్ని పెద్ద బడ్జెట్ చిత్రాల కోసం మేకర్స్ తో చర్చలు జరుపుతోంది. సినిమాల వరకే కాదు.. మునుముందో ఓటీటీలోనూ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. తాజా వార్త ఏమిటంటే రాశి త్వరలో తన డిజిటల్ అరంగేట్రం చేయడానికి సిద్ధంగా ఉంది. ఆమె ఒక హిందీ వెబ్ సిరీస్ లో నటించేందుకు సంతకం చేసినట్లు సమాచారం. వెబ్ సిరీస్ కు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారిక ధృవీకరణ చేయాల్సి ఉంటుంది. వెబ్ వేదికపై లస్ట్ స్టోరీస్ బ్యూటీ కియరా అద్వాణీలా చెలరేగుతుందా? అన్నది చూడాలి.

# ఉప్పెనకు ఓటిటి భారీ ఆఫర్..



ఒక డెబ్యూ హీరో సినిమాకి 10 కోట్లు పైబడిన బిజినెస్ అంటే పెద్ద ఆఫరే. మెగా ఫ్యామిలీ నుంచి పరిచయం అవుతున్న వైష్ణవ్ తేజ్ తొలి సినిమాకే ఏకంగా 13కోట్ల మేర ఓటీటీ ఆఫర్ వరించిందని సమాచారం. అయినా ఓటీటీ రిలీజ్ కి మేకర్స్ ససేమిరా అనేశారట. కారణం ఏమై ఉంటుంది? అంటే.. ఉప్పెనను ఎట్టిపరిస్థితిలో థియేట్రికల్ రిలీజ్ చేయాలనే పంతంతోనే మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు ఉన్నారట. ఇప్పటికే ఉప్పెన పాటలు పెద్ద సక్సెసయ్యాయి. కొత్త జంట పెర్ఫామెన్స్ అదరగొడుతోంది. ముఖ్యంగా కృతి శెట్టి అందచందాలకు కాలేజ్ కుర్రకారు ఫిదా అయిపోయారు. అందుకే ఈ సినమా 100 పర్సంట్ లవ్ రేంజులో పెద్ద హిట్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారట. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం వేరుగా ఉంది. థియేట్రికల్ రిలీజ్ చేయాలంటే కచ్చితంగా వ్యాక్సిన్ లేదా టీకా రావాల్సి ఉంటుంది. ఇప్పట్లో అందుకు ఆస్కారం కనిపించడం లేదు. దీంతో సంక్రాంతి వరకూ వేచి చూడాలని నిర్మాతలు భావిస్తున్నారట. మరోవైపు 13 కోట్ల ఆఫర్ తో ఓటీటీ కంపెనీ వెంటపడుతోందని తెలిసింది. కానీ ఇది డెబ్యూ హీరో సినిమా అయినా మైత్రి సంస్థ ఏమాత్రం రాజీకి రాకుండా 22 కోట్ల మేర బడ్జెట్ ని ఖర్చు చేసింది. ఈ సినిమాకి సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించారు. భారీ మొత్తాన్ని బాక్సాఫీస్ వద్ద వసూల్ చేయాల్సి ఉన్నందున మేకర్స్ కూడా ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ క్రేజీ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. తమిళ టాప్ నటుడు విజయ్ సేతుపతి ప్రధాన విలన్‌గా నటించారు. సేతుపతికి పారితోషికం భారీగానే ముట్టజెప్పిన సంగతి తెలిసిందే.




# నా ప్రాణం పెట్టి చేశాను..

సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ సోలో బ్రతుకే సో బెటర్ అనే సినిమాపై భారీగానే హైప్ క్రియేట్ అవుతోంది. ఆ మధ్య రిలీజ్ చేసిన నో పెళ్లి అనే ఫస్ట్ సింగిల్ ఓ రేంజ్‌లో వైరల్ అయింది. రానా, వరుణ్ తేజ్ వంటి వారి సాయంతో బాగానే ప్రమోట్ చేశాడు. ఇక నో పెళ్లి అనే సిగ్నేచర్ స్టెప్ ఓ రేంజ్‌లో క్లిక్కయింది. ఇక రెండో పాట కోసం వేసిన ఎత్తు అందర్నీ ఆశ్చర్యపరిచింది. దీని కోసం జనాలను బాగానే పిచ్చోళ్లను చేశారు. సెకండ్ సింగిల్ కోసం చేపట్టిన ప్రమోషన్స్ భాగానే వైరల్ అయ్యాయి. 'ఒక్కో సారి మనం ఎన్నో అనుకుంటాం కానీ ఆ టైం వచ్చినప్పుడు మరి'.. అంటూ ఓ వీడియో షేర్ చేశాడు. టాలీవుడ్ సింగిల్ ఆర్మీ అనే వాట్సాప్ గ్రూపులోంచి ఈ మధ్యే నిఖిల్, నితిన్, రానావంటి వారు పెళ్లి చేసుకుని అందులోంచి లెఫ్ట్ అయ్యారని, ఇక తాజగా తన వంతు వచ్చిందని ప్రభాస్‌కి సారీ చెబుతూ లెఫ్ట్ అయ్యాడు. అయితే ఈ ప్రకటన తన పెళ్లి గురించేనని కొందరు పప్పులో కాలేశారు. తీరా అది సోలో బ్రతుకే సో బెటర సెకండ్ సింగిల్ కోసమని తెలిశాక అందరూ ముక్కున వేలుసుకున్నారు. ఇక ఈ పాట రేపు ఉదయం పది గంటలకు రిలీజ్ కాబోతోంది. ఈ మేరకు తమన్ ఎమోషనల్ ట్వీట్ చేశాడు. రేపటికి అంతా సిద్ధమైంది.. ఈ పాటను నా ప్రాణం పెట్టి చేశాను.. సాయి ధరమ్ తేజ్ పట్ల నాకున్న ప్రేమ, నమ్మకానికి ప్రతిబింబంలా ఈ పాట ఉంటుంది. హే ఇది నేనేనా అనే పాట మీ అందరికీ పిచ్చెక్కిస్తుందని చెప్పుకొచ్చాడు.

# ఒరేయ్ బుజ్జిగా విడుదలకు సిద్ధం



రాజ్ తరుణ్ కొత్త సినిమా ఒరేయ్ బుజ్జిగా విడుదలకు సిద్ధమైంది. అన్నీ బాగుంటే, ఈపాటికి ఈ సినిమా థియేటర్లలో విడుదలయ్యేదే. ఇప్పుడు ఓటీటీ రిలీజ్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈలోగా రాజ్ తరుణ్ మరో కొత్త సినిమాపై సంతకం చేశాడు. మధుర శ్రీధర్ నిర్మాతగా రాజ్ తరుణ్ కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందనుంది. ఈ చిత్రానికి సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తారు. అల్లు శిరీష్ ఏబీసీడీ చిత్రంతో దర్శకుడిగా మారాడు సంజీవ్. ఇది రెండో సినిమా. చిరు అల్లుడు సత్యదేవ్‌తోనూ ఓ సినిమా ఓకే అయ్యింది. అయితే దానికంటే ముందుగా.. రాజ్ తరుణ్ సినిమానే పట్టాలెక్కే అవకాశాలున్నాయి. త్వరలోనే ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడవుతాయి.

# తిరుపతి, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు వార్తలు

## షరతులతో కూడిన బెయిలు

**రాజమహేంద్రవరం, వార్తావళి, ఆగస్ట్ 26:** రాష్ట్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లు రవీంద్ర రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం బెయిల్‌పై విడుదలయ్యారు. కృష్ణాజిల్లాకు చెందిన మోకా భాస్కరరావు అనే వ్యక్తి హత్య కేసుకు సంబంధించి ఎ-4 ముద్దాయిగా ఉన్న ఆయనకు మచిలీపట్నం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. జూలై 3వ తేదీన తూర్పు గోదావరి జిల్లా తుని వద్ద కృష్ణా జిల్లా పోలీసులు కొల్లు రవీంద్రను అరెస్టు చేసి మచిలీపట్నం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఆ తరువాత ఆయన బెయిల్ పిటిషన్ వేసినప్పటికీ కోర్టు తిరస్కరించింది. ఎట్టకేలకు మచిలీపట్నం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించి లక్ష రూపాయల విలువైన రెండు పూచీకత్తులను సమర్పించాలని ఆదేశించించారు. ఆ మేరకు కోర్టులో మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేయడంతో న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసారు. దీనితో గత 53 రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన బుధవారం ఉదయం సెంట్రల్ జైల్ నుంచి విడుదలై కృష్ణాజిల్లాకు బయలుదేరి వెళ్లారు. మీడియాతో అంతా వేచి చూసినప్పటికీ కొల్లు రవీంద్ర మాట్లాడటానికి నిరాకరించారు. 28 రోజుల పాటు సెల్ఫ్ క్వారంటైన్‌లో



ఉండటంతో పాటు మచిలీపట్నం విడిచి వెళ్లడానికి వీల్లేదని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు పెట్టడానికి అవకాశం లేదని న్యాయమూర్తి స్పష్టం చేసారు. గుడా మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గన్ని కృష్ణ తరపున పార్టీ నాయకులు కాశి నవీన్ కుమార్, ఉప్పులూరి జానకిరామయ్య, కడలి రామకృష్ణ, బెజవాడ రాజకుమార్, యిన్నమూరి దీపు తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా 'అంగన్వాడీ పిలుస్తుంది'

**నెల్లూరు, వార్తావళి, ఆగస్ట్ 26:** ఈ నెల 24వ తేదీ నుండి ప్రారంభం అయిన "మన అంగన్వాడీ పిలుస్తుంది "కార్యక్రమం లో భాగంగా మహిళాభిరుద్ధి శిశు సంక్షేమ శాఖ ఉదయగిరి ప్రాజెక్ట్ పరిధిలో బుధవారం చెర్లోపల్లి గ్రామం లో అవగాహనాకార్యక్రమం తో పాటు ర్యాలీ నిర్వహించారు. ఉదయగిరి మండలం లోని చెర్లోపల్లి, బండాగానిపల్లి, వడ్డెపాలెం గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు అయిన పద్మావతి, సుబ్బరత్నమ్మ, వెంకటమ్మ లు మూడు అంగన్వాడీ ల పరిధిలో ని గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కల్పించి అనంతరం గ్రామస్తులు పిల్లల తో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలు గర్భిణీ లకు, బాలింత లకు,పిల్లలకు అందిస్తున్న పౌష్టిక ఆహారం గురించి వివరించారు. చిన్న పిల్లలను తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి పంపాలని, అలాగే ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను



ప్రాథమిక పాఠశాలకు పంపాలని సూచించారు. వై. ఎస్. ఆర్ సంపూర్ణ పోషణ పథకం లో భాగంగా ఇక నుండి వారానికి ఆరు కోడి గుడ్లు, వంద ఎం. ఎల్. పాలు అందిస్తారని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాజెక్టు అధికారి సూచనల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ వాలంటీర్ లు, రేషన్ డీలర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌సిపి బలోపేతం చేసేందుకు కృషి

**రాజమహేంద్రవరం, వార్తావళి, ఆగస్ట్ 26:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజమహేంద్రవరం రూరల్ మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ బీసీ నాయకుడు చందన రమేష్‌కు ఆ పార్టీ నాయకులు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలియచేసారు. స్థానిక కోటగుమ్మం వద్దనున్న చందన జ్యూయలర్స్‌లో మాజీ ఎమ్మెల్యే చందన రమేష్‌తో పాటు వైసిపిలో చేరిన ఆయన తనయుడు, యువ వ్యాపార వేత్త చందన నాగేశ్వర్‌ను కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. వీరి రాకతో రాజమహేంద్రవరం సిటీ,రూరల్ నియోజకవర్గాల్లో వైఎస్ఆర్‌సిపి మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షల మేరకు వారు పార్టీ నాయకులతో కలిసి పనిచేసి ఏ ఎన్నికలు జరిగినా వైసిపి అధికారంలోకి వచ్చేలా కృషిచేయాలని కోరుతున్నారు. చందనను కలిసిన వారిలో రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు ముఖ్య అనుచరగణంతో పాటు పలువురు ప్రముఖ బీసీ నాయకులు కూడా ఉన్నారు. వైఎస్ఆర్‌సిపి నాయకులు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, కొంచ సత్య, మార్గాని సురేష్, కడియాల లక్ష్మణరావు, చీరా రాజు, అందనాపల్లి సత్యనారాయణ, గుడాల ప్రసాద్, మార్గాని చంటిబాబు, ఆరే చిన్ని, రాయుడు గణేష్, ఆర్తమూడి చిన్ని, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందన రమేష్, నాగేశ్వర్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్‌సిపిని బలోపేతం చేసేందుకు కృషిచేస్తామన్నారు. జగన్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తమకు అభినందనలు తెలియచేయడానికి వచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలి

**నెల్లూరు, వార్తావళి, ఆగస్ట్ 26:** నెల్లూరు నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ శ్రీ కె.వి.ఎన్. చక్రధర్ బాబు.., ఐ.సి.డి.ఎస్. అధికారులతో సమీక్షా, సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్‌లో అంగన్ వాడీ కేంద్రాలు ప్రారంభమవుతాయని, దానికి తగినట్లు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. అంగన్ వాడీ కేంద్రాల్లో కోవిడ్ ప్రోటోకాల్ ప్రకారం మాస్కులు ధరించి, సోషల్ డిస్టెన్స్ పాటిస్తూ సిబ్బంది విధులు నిర్వహించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న పౌష్టికా హారంపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, అంగన్ వాడీ కేంద్రం పరిధిలోని బాలింతలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. కోవిడ్ కేర్ సెంటర్లను ఐ.సి.డి.ఎస్ అధికారులు సందర్శించి, భోజనం నాణ్యతను పరిశీలించాలన్నారు. కోవిడ్ కేర్ సెంటర్లలో గర్భిణిలు ఉంటే..., వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి డెలివరీ అయ్యే వరకూ బాధ్యత తీసుకోవాలన్నారు. కోవిడ్ పాజిటివ్ వచ్చిన గర్భిణి స్త్రీలకు సంబంధించిన డెలివరీలు వీలైనంత వరకూ.., సమీపంలోని సి.హెచ్.సి లలో జరిగేలా ఏర్పాట్లు చేయాలని, ముందే అవ



సరమైన రక్తం సేకరించి నిల్వచేసుకోవాలన్నారు. అత్యవసరమైతే ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా చికిత్స అందించవచ్చని, ప్రైవేటు ఆస్పత్రుల్లో కోవిడ్ పాజిటివ్ వచ్చిన గర్భిణిలకు డెలివరీ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాల్లో జరుగుతున్న నాడు-నేడు పనులపై కలెక్టర్, ఐ.సి.డి.ఎస్. పి.డి అడిగి వివరాలు తెలుసుకున్నారు. గిరిజన మహిళలకు, శిశువులకు అదనపు పౌష్టికాహారం అందించడానికి.., రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం, బాల సంజీవని, భేటీ బచావో- భేటీ పడావో పథకాల అమలులో ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని కలెక్టర్.., ఐ.సి.డి.ఎస్. అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా, సమావేశంలో ఐ.సి.డి.ఎస్ పి.డి. సుధా భారతి, సి.డి.పి.ఓలు, అధికారులు హాజరయ్యారు.

## కోవిడ్ ఆసుపత్రుల ఏర్పాటుకు చర్యలు



**తిరుపతి, వార్తావళి, ఆగస్ట్ 26:** జిల్లాలో మొదటి విడతలో పలమనేరు, పీలేరు నియోజకవర్గం కలికిరి కేంద్రంగా కోవిడ్ ఆసుపత్రుల ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతున్నదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు ఎక్సైజ్ వాణిజ్య పన్నుల శాఖా మాత్యులు కె.నారాయణ స్వామి పేర్కొన్నారు. బుధవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి , రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖా మాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి ఆద్వర్యంలో జరిగింది. అనంతరం విలేఖరుల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ జిల్లాలో కోవిడ్ నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టడం జరుగుతున్నదని, ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లా కోవిడ్ ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని, పడకల పెంపు సామర్థ్యంలో భాగంగా మొదటి విడతలో పలమనేరు ఏరియా ఆసుపత్రిని, పీలేరు కేంద్రంగా కలికిరిలోని ఆసుపత్రిని కోవిడ్ హాస్పిటల్ గా చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతున్నదని, రెండవ విడతలో సత్యవేడులో కూడా కోవిడ్ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కోవిడ్ తో పోరాడాలని తెలిపారని అదే స్ఫూర్తితో జిల్లాలో కలెక్టర్ , డాక్టర్లు, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు అహర్నిశలు పనిచేయడం జరుగుతోందని తెలిపారు. కోవిడ్ తో మరణించిన వారికి దహన సంస్కరణలు చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని, మానవతా దృక్పథం తో ఈ విషయంలో ప్రజలు సానుకూల దృక్పథంతో ఉండి సహకరించాలని ఈ సంధర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ విలేఖరుల సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ఎన్.రెడెప్ప , తుడా ఛైర్మన్ మరియు చంద్రగిరి శాసన సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పీలేరు, మదనపల్లి,సత్యవేడు శాసనసభ్యులు చింతల రామచంద్రా రెడ్డి, నవాజ్ భాషా, ఆదిమూలం, ఎం ఎల్ సీ యండవల్లి శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.



తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన కోవిడ్.. 19 టాస్క్ ఫోర్స్ సమావేశంలో ఉప ముఖ్య మంత్రి శ్రీ కె.నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ (రెడ్డెప్ప, తుడా చైర్మన్ మరియు ప్రభుత్వ విప్ శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్సీ మరియు ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ డా.నారాయణ భరత్ గుప్త అధికారులు పాల్గొన్నారు.

– వార్తావళి, తిరుపతి

## శానిటేషన్ చర్యలు షురూ..

**నెల్లిపాక, వార్తావళి, ఆగస్ట్ 26:** వరదలు పూర్తి స్థాయిలో తగ్గాక చర్యలు ప్రారంభిద్దామనుకున్నారో, ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మహిమో, ఈ నెల 28 న జరుగనున్న ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు ధ్వజ మెత్తుతారనో తెలియదు గానీ మండల ప్రజాపరిషత్ యం త్రాంగం ఎట్టకేలకు శానిటేషన్ చర్యలకు ఉపక్రమించింది. ఎంపీ డీవో విఠల్ పాల్, ఈఒపిఆర్డి శ్రీను ల పర్యవేక్షణలో ఆయా పంచా యతీల సెక్రటరీలు దగ్గరుండి మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు.ఇందులో భాగంగా వ్యాధులు ప్రబల కుండా ప్రధాన రహదారులు,గ్రామాల్లోని వీధుల్లో చెత్త చెదారాలను తొలగింపజేస్తూ బ్లీచింగ్ చల్లిస్తున్నారు.

## మన ఆరోగ్యం మన చేతుల్లోనే

**ఆలమూరు, వార్తావళి, ఆగస్ట్ 26:** కరోనా (కోవిడ్-19) మహమ్మారి మానవాళిపై విరుచుకుపడుతున్న తరుణంలో ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలను పాటించటం వల్ల మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని ఆలమూరు మండలం చొప్పెల్ల పీ హెచ్ సీ వైద్యురాలు ఎం సుమలత అన్నారు. పీ హెచ్ సీ పరిధిలో గల గ్రామాల్లోని 68 మందికి విటీఎం పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచనలు సలహాలు పాటిస్తూ, సామాజిక దూరం, మాస్కులు ధరించి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ఇలా చేయటం వల్ల కొంత మేర కోవిడ్ నుండి మనకు మనం కాపాడుకో వచ్చునని ఆమె అన్నారు. మంగళవారం నిర్వహించిన టెస్ట ఫలితాలు మరో నాలుగు రోజుల్లో వెలువరించనున్నట్లు వైద్యురాలు తెలిపారు.

## హరిశ్చంద్ర స్మశాన వాటిక జరుగుతున్న ఎలక్ట్రికల్ యంత్రాలు పరిశీలన

**తిరుపతి, వార్తావళి, ఆగస్ట్ 26:** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో దేవేంద్ర థియేటర్ రోడ్డు వద్ద ఉన్న హరిశ్చంద్ర స్మశాన వాటిక నందు, స్మార్ట్ సిటీ నిధులతో కోటి 90 లక్షల రూపాయలతో నూతనంగా ఎలక్ట్రికల్ యంత్రాలతో దహన క్రియలు తో నిర్వహిస్తున్న ఏర్పాట్లను ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలించిన కమిషనర్ గిరీష. కమిషనర్ మాట్లాడుతూ కోవిడ్ తో మరియు సాధారణ మరణాలకు హరిశ్చంద్ర స్మశాన వాటిక కోసం ఏర్పాటు చేస్తున్న పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్రతిరోజు 50 నుంచి 60 చనిపోయిన శవాలకు వారికి దహన క్రియలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు పూర్తి చేసి, తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో చనిపోయిన వారికి దహన క్రియలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు.



## ప్రజాసేవలు యదావిధిగా కొనసాగించాలి

**తిరుపతి, వార్తావళి, ఆగస్ట్ 26:** కలియుగ దైవం ఆశీసులతో కరోన మహమ్మారిని జయించి యదావిధిగ ప్రజసేవలు కొనసాగించాలని కలియుగ దైవం శ్రీ వేంకటేశుని వేడుకుంటు, కరోన మహమ్మారిపై ప్రజలకున్న ఆందోళనలను అపోహలను తుడిచి వేయడంలో మా శాసనసభ్యులు




భూమణన్న పాత్ర ఎంతో అత్యద్భుతం. కరోన మహమ్మరి మరీంకగ వ్యాప్తి చెందకుండ వుండెందుకు ప్రజలకు సలహాలు సూచనలం అందించడంలో మా నాయకులు భూమణన్న గారికి సాటెవ్వరు లేని విధంగ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ధైర్యాలను కలిగిస్తు ప్రజలకు అండగ నిలబడి కరోనపై మా శాసనసభ్యులు భూమణన్న పోరాటం మాటలలో వర్ణింపరానిది, కరోణని కట్టడి చేయడంలో భూమణన్న గారి పాత్ర చాల అభినందనీయం. భూమణన్న కరోన మహమ్మారిని కట్టడి చేయడంతో కరోన మహమ్మారికి బద్ధ శత్రువుగ మిగిలి భూమణ న్నపై నేడు పగబట్టి నేడు సాక్షాత్తుగ అన్నగారిలోనికె ప్రవేశించి యుద్ధం ప్రకటిం చేసింది ఈ కరోన మహమ్మారి. కరోన మహమ్మారిని దిగ్విజయంగ జయించి యదావిధిగ మా నాయకులు భూమణన్న గారు ప్రజసేవలకు అంకితం కావాలని భగవంతుని వేడుకుంటు మా నాయకులు మా శాసనసభ్యులు సీఘ్రంగ కోలుకోవాలని మా కోసం మీరు కరోనబారిన పడినందుకు చింతిస్తున్నాము.

## వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

### సిపిఐ డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్

**రంపచోడవరం, వార్తావళి ఆగస్ట్ 26:** దేవీపట్నం మండలం లోని గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో మంగళవారం సిపిఐ డివిజన్ కమిటీ సభ్యులు డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్ ,మండల కార్యదర్శి వెంకట్రావు, శ్రీనివాస్ రెడ్డి, అబ్బాయి రెడ్డి, చిన్న బాబు పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా వరద బాధితులకు పునరావాస కేంద్రాలలో కల్పిస్తున్నాయి సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు ఈ సందర్భంగా ముంపు బాధితులు మాట్లాడుతూ గోదావరి వరద కారణంగా గత 15 రోజులుగా తాము అనేక ఇబ్బందులకు లోనయ్యే అని ప్రభుత్వ అధికారులు కనీసం తమ గోడు వినడం లేదని తమకు కనీసం త్రాగడానికి మంచినీరు భోజన సౌకర్యాలు కూడా అధికారులు కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారని సిపిఐ డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీపట్నం మండలం లో సుమారు 30కి పైగా గ్రామాలపై గోదావరి వరదల్లో చిక్కుకున్నాయి. గత 15 రోజులుగా 30 గ్రామాలకు చెందిన ప్రజలు గోదావరి వరదల్లో సర్వస్వం కోల్పోయిన వారికి కనీసం భోజనం మంచి నీళ్ళు కూడా లేక వేదన చెందుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. గోదావరి పరివాహక ప్రాంతమైన దేవీపట్నం మండలం లో ప్రతి సంవత్సరం జూలై ఆగస్టు నెలల్లో వరదలు వస్తాయనే విషయం అధికారులకు తెలిసిన విషయమేనని అయినా వారు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించారని కుమార్ అన్నారు. గత సంవత్సరం కాపర్ డ్యాం నిర్మించడం వల్ల వరద ఉధృతి మరింత పెరిగిందని ఈ విషయం అధికారులకు తెలిసిన వారు ఎందుకని ముందుగా ప్రజలను అప్రమత్తం చేయలేదని అన్నారు. వరదల్లో సర్వం కోల్పోయి గ్రామ సమీపంలోని కొండలపై తలదాచుకుంటున్న నిర్వాసితులకు ప్రభుత్వ అధికారులు తాగడానికి మంచినీరు భోజన సౌకర్యాలు కూడా కల్పించకపోవడం అధికారులకు ముంపు బాధితుల పై ఉన్న నిర్లక్ష్య వైఖరికి




అద్దం పడుతుందని అన్నారు. గత మూడు రోజులుగా వరద తగ్గుముఖం పట్టి కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలో నుండి బయటపడ్డాయని ఆ గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని కానీ ఆ గ్రామాలలో అధికారులు ఇప్పటి వరకు కనీసం బ్లీచింగ్ అని కూడా చల్ల లేదని కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యల వల్ల ప్రజలకు అధికారులపై పూర్తిగా విశ్వాసం పోయిందని కుమార్ అన్నారు. గత సంవత్సరం వరదల సమయంలో ప్రభుత్వం ప్రకటించిన ఐదు వేల రూపాయలు మళ్లీ ఈ సంవత్సరం వరదలు వస్తే గాని వారికి చెల్లించాలని విషయం గుర్తు రాలేదు అని ఆయన అన్నారు. ఆ చెల్లించిన ఐదువేల లో కూడా కొంతమందికి మాత్రమే ఖాతాల్లో జమ అయినవి మిగిలిన వారికి ఈ సొమ్ము రాలేదని దీనిని బట్టి నిర్వాసితుల పై అధికారుల నిరంకుశ వైఖరి కి అద్దం పడుతుందని కుమార్ అన్నారు. గత సంవత్సరం వరదల సమయంలో ప్రభుత్వం హడావిడి చేసి రోజుకో మంత్రి ని వరద ప్రాంతాలకు పంపేవారని ఈ సంవత్సరం గత సంవత్సరం వచ్చిన వరద కంటే ఉధృతంగా వరద లు వచ్చిన ఇప్పటివరకు వరద ప్రాంతాలలో ఒక్క మంత్రి కూడా పర్యటించి లేదని వారంతా ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు.

## సప్తనదుల్లో కొలువుదీరిన సంగమేశ్వరుని ఆలయం

అది వేలసంవత్సరాల చరిత్ర కలిగి వున్న ఆధ్యాత్మిక స్థలం.. ఎందరో మునుల తపస్సుకు ఆశ్రయమిచ్చిన పవిత్ర ప్రాంతం.. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా ఏకంగా ఏడు నదులు (తుంగ, భద్ర, క్రిష్ణ, వేణి, భీమ, మలాపహరిణి, భవనాసి) కలిసే అద్భుతమైన ప్రదేశం అదే కర్నూలు జిల్లాలోని సంగమేశ్వరం.ఎన్నో శైవాలయాలకు కొలువైన కర్నూలు జిల్లాలో సంగమేశ్వర ఆలయం ఒక్కటే ప్రత్యేక విశిష్టత కలిగి వుంది. జిల్లాలోని ఆత్మకూరు పట్టణానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో కృష్ణా నదిలో సంగమేశ్వర ఆలయం ఉంది సప్తనదీ సంగమంగా పిలువబడే ప్రాంతంలో ఉన్న సంగమేశ్వరాలయంగా ప్రసిద్ధికెక్కింది.

**స్థలపురాణం :** పూర్వం ఈ ప్రాంతంలో దక్షయజ్ఞం జరిగిందని, ఆ సమయంలో దక్షుడు సతీదేవిని అవమానించడంతో ఆమె యజ్ఞ వాటికలో పడి మరణించిందని పురాణ గాధ. సతీదేవి శరీర నివృత్తి జరిగిన ప్రాంతం కాబట్టి నివృత్తి సంగమేశ్వరాలయంగా ప్రసిద్ధికెక్కింది. మరొక కథనం ఏమిటంటే..... పాండవుల వనవాసం సమయంలో ధర్మరాజు ఈ ప్రదేశంలో శివలింగాన్ని ప్రతిష్టించాలని నిర్ణయించాడు. ఆయన ఆదేశంతో శివలింగం తీసుకురావడానికి కాశీకి వెళ్లిన భీముడు.. ప్రతిష్ట సమయానికి రాలేదు. దీంతో ఋషుల సూచన మేరకు ధర్మరాజు వేపమొద్దుని శివలింగంగా మలిచి ప్రతిష్ఠించి పూజలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న భీముడు తీవ్ర ఆగ్రహంతో తాను తెచ్చిన శివలింగాన్ని నదిలో విసిరేశాడు. భీముని శాంతింప జేయడానికి అతను తెచ్చిన శివలింగాన్ని నదీ తీరంలోనే ప్రతిష్ఠించి, భీమలింగంగా దానికి పేరు పెట్టాడు. భక్తులు భీమేశ్వరున్ని దర్శించుకున్న తర్వాతే సంగమేశ్వరున్ని దర్శించుకోవాలని సూచించినట్లు స్థలపురాణం చెబుతోంది.

**ఆలయ విశేషాలు :** ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఈ ఆలయం క్రమంగా శిథిలమైపోయింది. ప్రస్తుతం కనిపిస్తున్న ఆలయాన్ని సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం స్థానిక ప్రజలు నిర్మించారు. సుమారు లక్షా ఇరవై వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆలయంతోపాటు, చుట్టూ ప్రాకారం నిర్మించినట్లు శిథిలాలను చూస్తే అర్ధమవుతుంది. ఈ ప్రాకారానికి ఉత్తరాన గోపురద్వారం, పశ్చిమ దక్షిణ ద్వారాలపై మండపాలు నిర్మింపబడి ఉండేవని చరిత్ర చెబుతోంది. కానీ, ప్రస్తుతం అవేమీ కనిపించవు. ప్రధాన ఆలయం అత్యంత సాదాసీదాగా ఉంటుంది. ముఖ మండపం పూర్తిగా శిథిలమై పోగా అంతరాలయం, గర్భాలయాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. గర్భాలయంలో సంగమేశ్వరుడు పూజలందుకుంటున్నాడు. శివుడి వెనుక వైపున ఎడమ భాగంలో శ్రీలలితాదేవి, కుడి వైపున వినాయకుడు దర్శనమిస్తారు. అంతకు ముందు వారిద్దరికీ వేరు వేరు ఆలయాలు ఉండేవి. అయితే, అవి శిథిలమై పోవడంతో లలితాదేవి, గణపతులను గర్భాలయంలో ప్రతిష్టించారు. అన్ని ఆలయాల్లోలాగా ఈ క్షేత్రంలో నిత్య పూజలు జరుగవు. ఈ ఆలయం ఎక్కువ రోజులు శ్రీశైలం ప్రాజెక్టు నీటిలో మునిగివుండడమే కారణం. ఈ ఆలయం మొదట నది ఒడ్డున ఉండేది. శ్రీశైలం డ్యామ్ నిర్మాణం తరువాత సంగమేశ్వరాలయం 23 ఏళ్లపాటు నీటిలోనే మునిగిపోయింది. అసలు ఇక్కడ ఆలయం ఉందనే విషయాన్ని కూడా జనం మర్చిపోయారు. 2003 తరువాత శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం పడిపోయిన కాలంలో మాత్రమే ఆలయం నీటి నుంచి బయటపడింది. అప్పటి నుంచి తిరిగి ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి.

# విశాఖ రూరల్

## అవినీ పై ఉక్కుపాదం మోపుతున్న మైనింగ్ అధికారి ప్రతాప్ రెడ్డి

**ఎలమంచిలి, వార్తావళి, ఆగస్ట్ 26:** ఎలమంచిలి నియోజకవర్గం ,రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో అక్రమ మైనింగ్ జరుగుతుందని స్థానికులు ప్రజా సంఘాలకు ఫిర్యాదు చేయగా ,సమస్య ను ఆర్డీవో సీతారామారావు గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అని ,ఆర్ డి ఓ గారు కలెక్టర్ గారి దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా, కలెక్టర్ గారు మైనింగ్ అధికారి ప్రతాప్ రెడ్డి గారికి విషయం తెలియజేయగా, వెంటనే ప్రతాప్ రెడ్డి గారు తన సిబ్బందితో పంచదార్ల గ్రామంలో అక్రమ మైనింగ్ కీ పాల్పడుతున్న వారిపై దాడులు జరిపి బిల్లులు లేకుండా ఉన్న లారీల పై పెనాల్టీ వేసి ,వెంటనే పెనాల్టీ వసూలు చేసి ఈరోజు మరల ఎంత వరకు అక్రమ మైనింగ్ జరుగుతుందో సర్వే చేసేందుకు, వెళ్తున్నారని ,ఈ సర్వే లలో అక్రమం బయటపడితే భారీ స్థాయిలో పెనాల్టీ వెస్తామని ప్రకటించిన మైనింగ్ అధికారి, ప్రతాప్ రెడ్డి గారికి ప్రజా సంఘాల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అని ,సమస్యలపై వినతిపత్రం ఇచ్చిన వెంటనే సమస్యలు కలెక్టర్ గారి దృష్టికి తీసుకువెళ్లిన ఆర్డీవో గారికి కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని, అవినీతిపై ప్రజా సంఘాల వారు చేస్తున్న పోరాటాలకు అండగా ఉంటూ, సమస్యను వాడవాడలా పత్రికల ద్వారా తెలిసే విధంగా ప్రచురణ, చేస్తూన్నా పాత్రికేయ సోదరులకు కూడా మా ప్రజా సంఘాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని అన్నారు, ప్రతి ప్రభుత్వ అధికారి కూడా ధైర్యంగా నిజాయితీగా విధులు నిర్వహిస్తే ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టాలని చూసే అవినీతికి పరులకు అడ్డుకట్ట వేయవచ్చని అన్నారు.ప్రజా సంఘాల ప్రతినిధులు, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్ పాల్గొన్నారు.



## మదర్ థెరిస్సా 110వ జయంతి
### “పారిశుధ్య కార్మికులకు ఆహారసామగ్రి పంపిణీ

**అనకాపల్లి, వార్తావళి, ఆగస్ట్ 26:** బుధవారం స్టానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్.,వ్యవస్టాపక అధ్యక్షులు..బల్లా నాగభూషణ ము అధ్వర్యము లో సంస్థ కార్యాలయ ప్రాంగణం నందు..మదర్ థెరిస్సా 110.వ జయంతి సందర్భంగా జరిగిన సేవా కార్యక్రమము లో భాగముగా ముందుగా మదర్ థెరిస్సా చిత్ర పటానికి సంస్థ అధ్యక్షులు పూల మాల వేసి ఆమెకు ఘన నివాలులర్పించారు. అనంతరం ఈ కరోనా కష్ట,కాలము లో తమ ఆరొగ్యాలను పణము గా పెట్టి తమవంతు పాత్ర పోషించి పారి శుధ్య కార్మికులు ఎంతో శ్రమించి పనిచేస్తున్న వారికి తమ వంతు సాయముగా బియ్యం.. కాయ గూరలు.. ఆహార దినుసులను బల్లా నాగభూష ణము చేతుల మీదుగా అందచేసారు. కార్యక్ర మంలో బల్లా మాట్లాడుతూ మహి మానవతా వాది,భారత రత్న మదర్ థెరిస్సాను ఆదర్శము గా తీసుకొని ప్రతీ ఒక్కరూ తమవంతు సమా జానికి సేవలందించాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో సంస్థ ఉపాధ్యక్షులు.,ఉజ్జి సత్యనారా యణ, కార్యదర్శి, శీలా మానీలు, కార్యవర్గ సభ్యులు అల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.




## ఘనంగా మదర్ థెరిస్సా జయంతి

**నర్సీపట్నం రూరల్, వార్తావళి, ఆగస్ట్ 26:** మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గూడెపు తాతబాబు ఏర్పాటు చేసిన మదర్ థెరిస్సా విగ్రహం వద్ద బుధవారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ నాయకులు రాజాన వీరసూర్యచంద్ర ఘనంగా అంజలి ఘటించారు. అనంతరం పెదబొడ్డేపల్లిలో ఉన్న నిరాశ్రయుల ఆశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ సేవాతత్పరత భావం మెండుగా కలిగిన వ్యక్తి మదర్ థెరిస్సా అని ఆమె సేవలను కొనియాడారు. అందరూ మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. హరి చారిటబుల్ ట్రస్ట్ హరినాథ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులు అతి సామాన్యులు అయినప్పటికీ సేవ చేయాలనే తపనతో సమాజంలో తమవంతు సేవ చేయడంపై మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వారిని అభినందించారు. జనసేన రూరల్ అధ్యక్షుడు చక్రవర్తి మాట్లాడుతూ ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అందరూ సేవా కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మదర్ థెరిసా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు గూడుపు తాతబాబు మాట్లాడుతూ ట్రస్ట్ ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమంకు హాజరైన అతిధులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం మదర్ థెరిస్సా జయంతి రోజున విద్యార్థులకు పుస్తకాలు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అదే విధంగా మహిళల కోసం పండుగ సమయంలో రంగవల్లుల పోటీలు నిర్వహించామన్నారు. కరోనా విపత్కర సమయంలో 20 రోజుల పాటు మా ట్రస్ట్ తరఫున ఆహార పంపిణీ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి స్వామి, మారిశెట్టి రాజా, కొప్పాక కళ్యాణ్, గూడుపు తాతబాబు, అల్లు నరేష్, పి.నాగు, ద్వారపూడి జగదీష్, సిహెచ్.మల్లేష్, నర్సింగ్, గంగాధర్, పౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## కరోనా లక్షణాలున్న వారంతా కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

**అనకాపల్లి, వార్తావళి, ఆగస్ట్ 26:** అనకాపల్లి జోనల్ పరిధి లో ప్రతి రోజు కోవిడ్ టెస్ట్ లు రావు గోపాలరావు కళా క్షేత్రం నందు జరుగుతున్న విషయం మీ అందరికి తెలిసినదే. అయితే ఇటీవల టెస్ట్ లు చేయుంచుకొనే వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుంది. ప్రతి రోజు సుమారు 250 మందికి టెస్ట్ లు చేయుంచుకునే అవకాశం మనకు కలదు. కావున 60 సంవత్సరములు పైబడిన ప్రతి ఒక్కరు తప్పని సరిగాను, అలాగే కరోనా లక్షణాలు అయిన జ్వరం,జలుబు, గొంతి నొప్పి, శ్వాస మరియు కిడ్నీ సంబదిత ఇబ్బందిలు మరియు బి.పి., షుగర్, లక్షణాలుతో బాధపడే ప్రతి ఒక్కరు కోవిడ్ టెస్ట్‌లు చేయుంచుకోవలసనదిగా కోరుచు న్నాము. దయచేసి పట్టణ ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలసి నదిగా మనవి జేస్తున్నాము. టెస్ట్ లు చేయుంచు కోదలచిన వారు ప్రతి రోజు ఉదయం 8. గం.లకు తమ ఆధార కార్డు తీసు కొని నేరుగా రావు గోపాలరావు కళా క్షేత్రంలో పేరు నమోదు చేసుకొని టెస్ట్ లు చేసుకోవలసినదిగా మనవి చేస్తున్నాము. కావున పై విషయంలో ఎటువంటి సందేహాలు ఉన్నా టెస్ట్ ఇన్ ఛార్జ్ లు అయిన పి.వి.రమేష్ బాబు( 9666475999) పి.శరత్ కుమార్(70959 58338) మరియు లైజిన్ ఆఫీసర్ మత్ర శేఖర్ బాబు (7780382333) లను సంప్రదించవలెను అని జోనల్ కమీషనర్ పి.శ్రీరామ మూర్తి తెలియజేశారు.

## ఎన్టీఆర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజాబాబు మాతృమూర్తి కన్నుమూత

**అనకాపల్లిటౌన్, వార్తావళి, ఆగస్ట్ 26:** ఎన్టీఆర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంతులూరి వెంకట జగన్నాథరాజు (రాజాబాబు) మాతృ మూర్తి ఉదయకుమారి (90) బుధవారం ఉదయం తుమ్మపాలలోని తన స్వగృహంలో పరమపదించారు. గత ఎనిమిది మాసాలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇంట్లోనే ఉంటున్నారు. ఉదయం ఆకస్మికంగా మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజాబాబు తండ్రి బంధువులైన దంతులూరి రామచంద్రరావు మున్సిపల్ చైర్మన్‌గా, దంతులూరి బంగార్రాజు సమితి ప్రెసిడెంట్‌గా గతంలో పనిచేసారు. రాజకీయ కుటుంబం కావటంతో రాజాబాబు తెలుగుదేశంపార్టీలో క్రియాశీల కంగా వ్యవహరించారు. అనకాపల్లి ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి మొదటి చైర్మన్‌గా విధులు నిర్వర్తించారు. కాగా రాజాబాబు మాతృమూర్తి మృతివార్త తెలియగానే తేదే పా నేతలు విచారం వ్యక్తం చేసారు. టీటీపీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగధీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయ ణలు ఉదయకుమారి మృతి పట్ల తమ సంతాపాన్ని వ్యక్తం చేసారు. రాజాబాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. అలాగే తేదేపా నేతలు కొణతాల వెంకటరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కొణతాల శ్రీనివాసరావు, నడిపల్లి గణేష్, కర్రి బాబి, ఆడారి గోవిందరావు, దొడ్డి సత్యఅప్పారావు, చదరం కాశీవిశ్వేశ్వరరావు తదితరులు రాజా బాబు మాతృమూర్తి ఉదయకుమారి మృతికి తమ సంతాపాన్ని తెలిపారు.



### ప్రభుత్వ భవనాలను నిర్దేశించిన
## గడువులోగా పూర్తి చేయాలి
### నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

**నర్సీపట్నం, వార్తావళి, ఆగస్ట్ 26:** క్షేత్ర స్థాయిలో నిర్మాణంలో ఉన్న వివిధ భవనాలు, ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయడానికి కృషి చేయాలని నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యా లయ సమావేశ మందిరంలో నర్సీపట్నం డివిజన్ స్థాయిలో ఉన్న తహశీల్దార్లు, ఈవోపిఆర్‌డిలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అమలుకు కార్యాలయాలు ఎంతో అవసరమని కావున వీటిని త్వరితగతిన నిర్మించేందుకు క్షేత్ర స్థాయిలో అధికారులు చొరవ చూపాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పంచాయతీ అధికారి కృష్ణవేణి, డివిజనల్ పంచాయతీ అధికారి శిరీషారాణి, డివిజన్‌లోని అన్ని మండలాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## నిమజ్జనోత్సవం, సేవా కార్యక్రమాలు రద్దు

**అనకాపల్లిటౌన్, వార్తావళి, ఆగస్ట్ 26:** వినాయక నవరాత్రులను పురష్కరించుకుని ప్రతీ ఏటా నిర్వహించే నిమజ్జనోత్సవం సేవా కార్యక్రమాలు ఈ ఏడాది కరోనా నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతీ ఏటా ఈ కమిటీ వినాయక నవరాత్రుల సందర్భంగా నిమజ్జనోత్సవం, మట్టి ప్రతిమల వినియోగం, వాటివల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు, వ్యాసరచన పోటీలు నిర్వహించేది. అలాగే పట్టణంలో నిర్వాహకులు ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలను పర్యవేక్షించి వాటిలో సాంప్రదాయ విగ్రహాలను ఎంపిక చేసి అలాంటి విగ్రహాలకు బహుమతుల ప్రధానోత్సవం, వినాయక మండపాల్లో సెట్టింగ్‌లకు ప్రశంసాపత్రాలు అందజేసే కార్యక్రమం చేపట్టేది. కాగా ఈ సంవత్సరం కరోనా వైరస్ పట్టణంలో తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఈ సేవా కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి, గౌరవ కార్యదర్శి మళ్ల సురేంద్ర, వైస్ చైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్, కమిటీ ప్రధాన కార్యదర్శి కేఎం నాయుడు, బొద్దపు ప్రసాద్, అల్లు త్రినాధ్, కొయిలాడ గణేష్ తదితరులు వెల్లడించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ కుమారస్వామి మాట్లాడుతూ గత ఏడాది 25వేల మట్టి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేయగా ఈ ఏడాది 5వేలు వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేసినట్లు తెలిపారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని అన్ని దేవాలయాలకు, ప్రభుత్వ శాఖలకు కూడా ఉచితంగా మట్టి ప్రతిమలు పంపిణీ చేసామన్నారు. కరోనా నేపథ్యంలో ఈ ఏడాది ప్రజలు, గణపతి మాలధారణ భక్తులు సామూహిక పూజలు నిర్వహించకుండా ఎవరి ఇంట్లో వారే పూజలు జరుపుకోవాలని నిమజ్జనోత్సవ కమిటీ ముందుగానే పిలుపునిచ్చిందన్నారు. ప్రజలు స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా కొన్ని ప్రభుత్వ శాఖలు ప్రజలకు పర్యావరణాన్ని పాడుచేసే విధంగా తమ నిర్లక్ష్యం ప్రదర్శించారని విమర్శించారు. వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ నేతలు కొమ్మోజు రమేష్, కొణతాల హరనాధ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

**ఆదిత్యలో మదర్ థెరిస్సా110వ జయంతి వేడుకలు**

గండేపల్లి/న్యూస్ విజన్: గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యాప్రాంగణం గ్రంథాలయ విభాగం వారి ఆధ్వర్యంలో మదర్ థెరెసా 110 వ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల విద్యార్థినుల (గర్ల్స్ హాస్టల్ క్యాంపస్) వసతి గృహము నందు గల మదర్ థెరిసా విగ్రహానికి ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్,కళాశాల ప్రిన్సిపాల్,డా.ఆదిరెడ్డిరమేష్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. థెరిసా 110వ జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.రమేష్ ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అని థెరిసా తన సేవలు ద్వారా నిరూపించారు అనీ ప్రతీ ఒక్కరూ సేవాభావంతో సమాజానికి, మరీ ముఖ్యంగా పేదలకు సేవచేయడమే ఆమెకు మనం అందించే ఘణనివాళి అని అన్నారు. ఈ సందర్భంగా గ్రంధా లయవిభాగాధి పతి.కె.అశోక్ మార్ మాట్లాడుతూ మదర్ థెరెసా పేదలకు, వృద్దులకు అందించిన స్వచ్ఛంద సేవల గురించి మాట్లాడారు.

## మరింత పురోభివృద్ధి చేయడమే లక్ష్యం
### సీనియర్ మేనేజర్ బిందు ప్రత్యూష వెల్లడి

**మునగపాక, వార్తావళి, ఆగస్ట్ 26:** జిల్లాలో పలు ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘాలును మరింత పురోభి వృద్ధి చేయడమే లక్ష్యంగా పలు చర్యలు చేపడుతున్నట్లు సహకార సంఘాలు ప్రత్యేకాభివృద్ధి కమిటీ సీనియర్ మేనేజర్ బిందు ప్రత్యూష పేర్కొన్నారు. మండల కేంద్రమైన మునగపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంనకు బుధవారం ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రత్యూష మాట్లాడుతూ గతంలో కంటే సహ కార సంఘాలు సేవలు మరింతగా పెంచిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పుడు సహకార సంఘాలు సేవలు పొందడానికి వినియోగదారులు రోజు రోజుకు పెరుగుతున్నారని తెలిపారు. రైతులు, వినియోగదారులు అవసరాలకు అనుగుణంగా ఆఫ్కాబ్ మరిన్ని పథకాలు అమలు చేస్తుందన్నారు. దానిలో భాగంగా మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో గోదాం నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన చేయడానికి విచ్చేయడం జరిగిందన్నారు. గోదాం నిర్మాణానికి సంబంధించి స్థానిక సంఘం పది శాతం వాటాగా చెల్లిస్తే అఫ్కాబ్ 50 శాతం మిగిలిన 40 శాతం ప్రభుత్వం ఇస్తుందన్నారు. స్థల పరిశీలన చేసి గోదాం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాధన ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. తొలుత స్థానిక సహకార సంఘం గోదాంలో ఉన్న ఎరువులను పరిశీలించారు. అనంతరం సీఈవో నాగేశ్వరరావు ద్వారా సంఘం ఆర్థిక లావాదేవీలు అడిగి తెలుసుకున్నారు. డిపోజిట్లు, బంగారం ఆభరణాలుపై ఇచ్చే రుణాలు గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు లాకర్‌లను పరిశీలించారు. నాబార్డ్ సహకారంతో సంఘాలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించే దిశగా నేడు ప్రత్యేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. రైతులకు కూడా మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు సాగునకు అవసరమైన యంత్రాలు, పనిముట్లు కల్పించే దిశగా ఆలోచనలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఏజీఎం పి.వి.ఎస్.నాయుడు, అనకాపల్లి బ్రాంచ్ సూపర్‌వైజర్ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలపై ధర్నా

**నాతవరం, వార్తావళి, ఆగస్ట్ 26:** సిపిఎం పార్టీ దేశవ్యాప్త పిలుపుమేరకు నాతవరం మండలంలో పలు సమస్యలపై బుధవారం నాతవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ నాతవరం మండలం సరుగుడు పంచాయతీలో సిరిపురం, కెవి.శరభవరం పంచాయతీ వల్సంపేట, నాతవరం ఎస్సీ కాలనీ, మాధవనగరంలో సర్వే పూర్తి కాలేదన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభించాయని వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సరుగుడు నుండి సిరిపురం రోడ్డు పనులు ఏడు కిలోమీటర్లును తక్షణమే పూర్తి చేయాలన్నారు. వల్సంపేట పంచాయితీలలో తాళ్లపాలెంలో అంగన్వాడీ సెంటర్‌ను ఎర్పాటు చేయాలని, కరోనా కష్టకాలంలో చేతివృత్తిదారులను ఆదుకోవా లన్నారు. ఉపాది హామీ పనులు ప్రతి కార్మికుడుకు 200రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగమణి, దేముడు, వెంకటలక్ష్మి తదితర్లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు శానిటీజర్స్, మాస్కులు తప్పనిసరిగా వాడాలి

**కశింకోట, వార్తావళి, ఆగస్ట్ 26:** రోజు రోజుకు విజృభిస్తున్న కరోనా దరి చే రకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు సానిటీజర్స్, మాస్కులు తప్పని సరిగా వాడాలని అనకాపల్లి సేన సేవకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు అన్నారు. బుధవారం అనకాపల్లి సేన పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకులు కొణతాల సీతారాం సహకారంతో 30వ రోజు తాళ్లపాలెం గ్రామంలో రెండు వందల మందికి సానిటీజర్స్, మాస్కులు పంపిణీ చేసారు.అనకాపల్లి సేన సేవకులు రామరాజు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సీతారాం అనకాపల్లి నియోజకవర్గంలో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కరోనా విజృభిస్తున్న కారణం 30వ రోజు తాళ్లపాలెం గ్రామంలో పంపిణీ చేయడం జరిగింది అన్నారు.వైసీపీ నాయకులు లగిశెట్టి గణేష్ మాట్లాడుతూ ఇప్పటి పరిస్థితుల్లో తిండి కంటే జాగ్రత్తలు ముఖ్యమని,ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే మానవుడు మనుగడ సాధ్యమన్నారు.రాజకీయాలకు అతీతంగా కొణతాల సీతారాం చేస్తున్న సేవలు అందరికీ ఆదర్శం అన్నారు.టీడీపీ నాయకులు ఉలింగల రమేష్ మాట్లాడుతూ జీవితంలో ఏది మనకు శాశ్వతం కాదు అనీ,ఎవరైనా తమ శక్తి కొలదీ సహాయం చేయడం మానవ ధర్మం అన్నారు.ఇటువంటి సేవ కార్యక్రమాలు సీతారాం గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిన్ని జనార్ధన్, టీడీపీ నాయకులు చిన్ని కోటేశ్వరరావు,యరంసెట్టి రవి, బీజేపీ నాయకులు చిన్ని భూషణం,సేవకులు కొమ్మన యస్వంత్ అరుణ్ కుమార్,ప్రగడ మోహన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ప్రాణాలతో ఆటలాడొద్దు
### మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం టౌన్, వార్తావళి, ఆగస్ట్ 26:** మీ పబ్లిసిటీ కోసం పిల్లల ప్రాణాలతో ఆటలా డవద్దని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. సెప్టెంబర్ 5వ తేదీ నుంచి పాఠశాలలు రీ ఓపెన్ చేస్తు న్నామని ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ తప్పుడు నిర్ణ యాన్ని తీసుకుంటున్నారన్నారు. కరోనా సమ యంలో తీసుకోవాల్సిన నిర్ణయమేనా అని ప్రశ్నించారు. ఇప్పటికే మీ చేతగానితనంతో, నిర్లక్ష్యంతో మన రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య మూడున్నర లక్షలకు దాటిందన్నారు. పెద్ద పెద్ద డాక్టర్లే ఈ కరోనా ప్రభావం, వ్యాధి సోకే అవకాశం మరో రెండు మూడు నెలల వరకు ఉంటుందని చెబుతున్నారని, అలాంటిది ఇటువంటి సమయంలో బుర్ర ఉన్న వాళ్ళు ఎవరైనా స్కూల్స్ ఓపెన్ చేసి పిల్లల ప్రాణాలతో ఆటలాడుకుంటారా అని ఎద్దేవా చేశారు. ఈ నిర్ణయాన్ని పిల్లల తల్లిదండ్రులు కూడా చాలామంది వ్యతిరేకిస్తు న్నారన్నారు. ఇప్పటికే కరోనా వచ్చి హాస్పటల్లో జాయిన్ అయిన వారికే సరైన ట్రీట్మెంట్, భోజన సదుపాయాలు లేవన్నారు. ఇలాంటి సమయంలో మళ్లీ స్కూల్స్ ఓపెన్ చేసి పిల్లల్ని కూడా ఇబ్బందుల్లో పెడతారా అని ప్రశ్నించారు. సెప్టెంబర్ 5వ తేదీ నుంచి స్కూల్స్ తెరవడానికి గల కారణం స్కూల్ పిల్లలకి స్కూల్ కిట్స్ ఇచ్చి పిల్లలతో పబ్లిసిటీ చేసుకోవడానికి మాత్రమే స్కూల్స్ తెరుస్తున్నార న్నారు. మీ పబ్లిసిటీ కోసం పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతారా అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు చెప్పడం మంచి నిర్ణయమని, కానీ కొన్ని ప్రైవేట్ స్కూల్లలో, ఈ కోర్సు కోసం నెలకు ఐదు వేలు చొప్పున మూడు నెలలకు 15వేల రూపాయలు తీసుకుంటున్నారన్నారు. ఈ కరోనా సమయంలో చాలా మందికి పనులు లేక, జీతాలు లేక ఆ డబ్బులు కూడా చెల్లించలేని పరిస్థితిలోకొంత మంది తల్లిదండ్రులు ఉన్నారని, మరికొంత మంది మొబైల్ ఫోన్ లేక ఆన్‌లైన్ క్లాసులకు హాజరవ్వని పరిస్థితి ఉందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పిల్లలందరికీ ప్రభుత్వమే ఆన్‌లైన్ క్లాసులకి ఆర్థిక సాయం చేయాలని కోరారు. సెప్టెంబర్ 5 నుంచి స్కూల్స్ రీఓపెన్ చేస్తానన్న నిర్ణయాన్ని మీరు మార్చుకోకపోతే, ఆ తర్వాత పిల్లలకు ఏమి జరిగినా పూర్తి బాధ్యత మీరే వహించాల్సి ఉంటుందన్నారు.



# విశాఖపట్నం



విశాఖ సితమ్మధారలోని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావుని కలసిన జిల్లా రెవెన్యూ అధికారి ఆశాపు ప్రసాద్.

– వార్తావళి, విశాఖ దక్షిణం

## ఉరుసు ఉత్సవాలు రద్దు

### కోవిడ్ నేపథ్యంలో ప్రకటించిన అధికారులు

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, ఆగస్ట్ 26:** కరోనా నేపథ్యంలో ఏటా వన్ టౌన్ కోటవీధి దరిలో జరగాల్సిన ఉర్సు హాజరత్ సయ్యద్ అలీ ఇపాకీ మదనీ అవులియా ఉత్సవాలను రద్దు చేసినట్టు సంబంధిత జిల్లా వక్ఫ్ బోర్డ్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు జరగాల్సిన చందనోత్సవ కార్యక్రమాన్ని కేంద్ర. రాష్ట్ర. వకఫ్ బోర్డ్ ఆదేశాల మేరకు నిలిపివేస్తున్నట్టు కూడా ప్రకటించారు. ఉత్సవ చందర్, చాధర్ పండగను కూడా అధికారులు, మత పెద్దల ఆధ్వర్యంలోనే నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముస్లిం, సూఫీ భక్తులు గుర్తుంచుకోవాలని కోరారు.

## ఘనంగా మంజుల జన్మదిన వేడుకలు



**గాజువాక, వార్తావళి, ఆగస్ట్ 26:** వాంబే కాలనీలో 65 వార్డులో వాంబే కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మరియు విశాఖ జిల్లా వైయస్సార్ సిపి మహిళా నాయకురాలు మంత్రి మంజుల జన్మదిన వేడుకలు వా0బే కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 76 వార్డు వైఎస్ఆర్ సీపీ అభ్యర్థి దొడ్డి రమణ పాల్గొని కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దొడ్డి రమణ మాట్లాడుతూ మంజుల గారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆ భగవంతుని తల్లిదండ్రుల దీవెనలు మంజుల గారిపై ఉండి నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో హాయిగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పప్పల పూస్ప, పూడిశాంతి, పప్పల ఆదిలక్ష్మి, రమణమ్మ,పద్మ, రాంబాబు, రెడ్డి గారు, సతీష్,అన్నజి, అప్పారావు, శ్రీనివాస్, సత్యవతి, సావిత్రి, శంకర్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్ణయంతో బాలికల సత్వర న్యాయం

### చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం



**విశాఖపట్నం, ఉత్తరం, వార్తావళి, ఆగస్ట్ 26:** రాష్ట్రంలోని ఆడపిల్లల రక్షణతో పాటు సత్వర న్యాయం జరిగేలా ప్రభుత్వం 8 ప్రత్యేక కోర్టులు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినంద నీయమని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు, బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ బాలికలుపై లైంగిక దాడులు (పోక్సో) కేసులు, వందకు పైగా దాటిన,పెండింగ్ లో ఉన్న ఉత్త రాంధ్ర జిల్లాలతో పాటు మిగతా జిల్లాల్లో జిల్లా న్యాయమూర్తి క్యాడర్‌తో 8 ప్రత్యేక కోర్టు లు ప్రభుత్వం ఏర్పాటు నిర్ణయం వల్ల సత్వరమే దోషులకు శిక్ష లతో పాటు బాలికల భద్రతకు పూర్తి చేయూ తనిచ్చి ఆదరించిందన్నారు. ఈ ప్రత్యేక కోర్టుల ఆవశ్య కతను గుర్తించిన తాము పలు దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి,అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం తరపున నివేదికల రూపంలో అంద జేసినట్లు గుర్తు చేశారు. బాలల హక్కులు,వారి సంక్షేమం పై ప్రత్యేక దృష్టిని సారించి సానుకూల ఉత్తర్వులు వెలు వరించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి,అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం లతో పాటు ప్రభుత్వ నేతలకు,అధికారులకు రాష్ట్రం లోని బాలలందరి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

## మథర్ థెరిసా ఆశయ సాధన కోసం కృషి

**పెందుర్తి, వార్తావళి, ఆగస్ట్ 26:** మదర్ తెరెసా ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేసి ... సమాజానికి సేవలు అందించాల్సిన అవసరం ఉంది అని మదర్ తెరెసా ఎవర్ గ్రీన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోటిపల్లి ప్రసాద్ ,రాష్ట్ర బహుజన సమాజ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోని కృష్ణ ప్రజలకు పిలుపుని ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి లో ఉన్న అంబెడ్కర్ విగ్రహం వద్ద మదర్ తెరెసా జన్మ దినవేడుకలు ట్రస్ట్ అధ్యక్షులు కోటిపల్లి ప్రసాద్ అద్వర్యం లో ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా పై వక్తలు మాట్లాడుతూ, మదర్ తెరెసా ఈ దేశానికి చేసిన సేవలు కొనియాడారు .ప్రతి ఒక్కరూ మదర్ తెరెసా అడుగుజాడల్లో నడిచి సమాజానికి సేవలు అందించాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బి.జోసెఫ్, బి.తాత బాబు ,కే. జయమ్మ,సావిత్రి మహిళ సంగం అధ్యక్షురాలు టెకెటి ప్రేమ కుమారి ,దళిత నాయకులు బోనెల ఏసుబాబు, డుంబారు రామరావు మరికొంత మంది నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశ్రమ బాలికల పాఠశాలలో నాడు-నేడు పనులు

**పాడేరు, వార్తావళి, ఆగస్ట్ 26:** రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యం ప్రమాణాలు మార్చలన్న దృఢ సంకల్పంతో కొట్లాదిరూపాయలు వెచ్చించి పాఠశాలల రూపురేఖలు మార్చే దిశగా ప్రయాణాలు సాగిస్తున్నా భాగంలో మండలంలో గల కందమామిది గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో నాడువలే నాడు-నేడు పనులు సాగుతున్నాయి.వివరల్లోకివెళ్తే మండలానికి కూతవేటు దూరంలో నున్న కాందమామిది పాఠశాలకు నాడు-నేడు పనులకు ట్రైబల్ వెల్ఫేర్ నిధుల నుండి 59 లక్షలు రూపాయలు నిధులు మంజూరు చేశారు.అయితే పాఠశాల రూపు రేఖలు మార్చుడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వారికి చెక్కు పవర్ పూర్తి స్థాయిలో ఉంటుంది.ఇదిలా ఉండగా ఇక్కడ పనులు చేయించే కాంట్రాక్టర్ కు కరోన లక్షణాలు ఉండటంతో అతను నెల రోజులనుంచి పాఠశాలవైపు అడుగుపెట్టడంలేదు. దింతో ప్రదనోపాధ్యాయురాలు దగ్గరుండి పనులు చేస్తున్నప్పటికీ ఎవ్వరి పనులు వారు చేస్తేనే ఎక్కడో ఒకచోట తప్పిదాలు జరుగుతుంటాయి మరి అలాంటి తప్పిదాలు ఇక్కడ కోక్కల్లాలు.నాణ్యత లోపాలతోపాటు పనులు ఆలస్యం.ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ఆగస్టు 31 లోగా పాఠశాల పనులు పూర్తిచేసి అప్పజెప్పాల్సి ఉండగా 50% కూడ పనులు పూర్తి కాలేదు.పాఠశాలలో రేకులు మాత్రమే కలర్ ఫుల్ గా కనిపిస్తుందే తప్ప మిగతా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుఉంది.దింతోనాడు వాలే నాడు-నేడు పనులు ఉందని ఒక ఉదాహరణగా చెప్పవచ్చును.



## సిపిఎం భీమిలి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన

**భీమునిపట్నం, వార్తావళి, ఆగస్ట్ 26:** ప్రభుత్వ వైద్య రంగాన్ని తక్షణమే బలోపేతం చేయా లని సిపిఎం; జిల్లా కార్యదర్శి కె లోకనాథం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం; భీమిలి మండల కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస సచివాలయం ఎదుట; నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రిలో సహితం ప్రభుత్వ మార్గ దర్శకా లకు అనుగుణంగా ఉచితం గానే కరోనా నిర్ధారణ పరీక్షలు జరపాలనీ అన్నారు. ప్రభుత్వం చేసిన క్వారంటైన్ కేంద్రాలతో పాటు, హోమ్ క్వారంటైన్‌లో ఉన్న కోవిడ్ -19 బాధితులందరికీ ఉచితం గా మందులు, పౌష్టికాహారం ఇవ్వాలని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కార్యదర్శి రవ్వ నర్సింగరావు, మం డల నా యకులు ఎస్. అప్పలనాయుడు, చింతపల్లి అప్పయ్యమ్మ, కర్రి రాము, అన్నాబత్తుల నర్సింగరావు, పి కృష్ణ వేణి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలి

### మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



**భీమునిపట్నం, వార్తావళి, ఆగస్ట్ 26:** ప్రభుత్వ పథకాలు వారికి అందించే బాధ్యతను నాయకులు తీసుకోవాలని మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీ నాయకులకు పిలుపు నిచ్చారు.భీమిలీ క్యాంప్ ఆఫీస్ లో స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ప్రక్క త్రోవ పెట్టకుండా చూడాలనీ అన్నారు. ప్రతి లబ్ది దారునికి ఇంటికి చేరేలా దగ్గరుండి సేవలు అందించాలని కోరారు. ఎవరైనా లంచాలు ఆశిం చడం గానీ, లబ్ది దారుల వద్ద వసూళ్లు చేయడం చేస్తే కఠిన చర్య లు తప్పవని అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాల్లో మరింత; ఆధ్యాత్మికంగా సాంస్కృతికంగా అభివృద్ధి చేయడానికి; కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి మహేష్ ,అల్లిపిల్లి నర్సింగ్ రావు, కరుణాకర రెడ్డి, అక్రమాన రాము నాయుడు ఎం షన్ముగ రావు తదితరులు పాల్గొన్నారు.

## మదర్‌థెరిసా 110 వ జయంతి వేడుకలు




**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, ఆగస్ట్ 26:** రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ,భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం సంయుక్త నిర్వహణలో భారతరత్న మదర్ తెరిసా 110 వ జయంతి వేడుకలు ప్రకృతి చికిత్సాలయం మహారాణి పేట ఆవరణలో జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జాతీయ అవార్డు గ్రహీత శ్రీ రూపాకుల రవికుమార్ ముందుగా మదర్ చిత్రపటానికి పూలు జల్లి ఘన నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అనే సంకల్పంతో కుష్టు వ్యాధి గ్రస్తులకు నిరంతరము సేవలు చేశారని, మురికి వాడలో నివసించు పేద ప్రజల ఆకలి తీర్చుటకు కృషిచేసి మానవతను చాటుకున్నారని అన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా పయనించారు. నేటి యువత ఆ మాతృమూర్తి అడుగుజాడల్లో ప యనించాలని, అందరికీ ప్రేమను, అభిమానము, సేవను పంచాలని కోరారు.కలకత్తాలో మిషన్ చారిటీస్ సంస్థ ద్వారా 123 దేశాలలో రోగులకు, పేదలకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ శ్రీలక్ష్మి, ఎస్ మహేష్, గేదెల శ్రీహరి, వంశీకృష్ణ, కృష్ణమాచార్యులు, మంగ, రమణ మొదలగువారు పాల్గొన్నారు.

## బీజేపీ ప్రభుత్వ విధానాలను విడనాడాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నర్సింగరావు డిమాండ్

**విశాఖపట్నం, వార్తావళి, ఆగస్ట్ 26:** కరోనా కాలంలో చాపక్రిందనీరులా బిజెపి ప్రభుత్వం దేశాన్ని తాకట్టు పెడుతుందని, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యద ర్శివర్గ సభ్యులు సిహెచ్ నరసింగరావు ఆందోళన వ్యక్తం చేసారు. సిపిఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా మద్దిలపాలెం సిపిఎం నగర కార్యాలయం నుండి ఆర్టీసి కాంప్లెక్స్ వరకు బుధవారం నిరసన ప్రదర్శన, అనంతరం నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో నరసింగరావు మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఈ నెల 20 నుండి 26 వరకు సిపిఎం నిరసనలకు పిలుపునిచ్చిందన్నారు. సిపిఎం పిలుపు ల్లో పెద్దఎత్తున ప్రజానీకం పాల్గొని తమ నిరసన తెలియజేసాం ్నారు. జనధన్ క్రింద 500 రూపాయలు, 5కేజీల బియ్యం ఇచ్చి మోడీ చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కేరళ వామపక్ష ప్రభుత్వం 7500 రూబబలు, ప్రతి కుటుంబానికి 35 కేజీల బియ్యం , 16 రకాల నిత్యావసర సరుకులు అందజేసిందని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేరళ తరహాలో ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. వ్యవసాయరంగంలో అడ్డదారుల్లో 3 ఆర్డినెన్స్ లు తీసుకొచ్చిందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు ఎటువంటి ఉపాధి భరోసా ఇవ్వలేకపోయిందన్నారు. పైగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కొరవడినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయ న్నారు. ఆర్టీసిలో పనిచేసే అవుట్ సోర్స్ కార్మికులను, పరిశ్రమల్లో ప నిచేసే కార్మికులను వందలాదిమందిని తొలగించారన్నారు. వీరందరికీ ఉపాధి రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారు. వైద్యరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో నేడు కరోనా బాధితులు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విమ్స్ హాస్పటల్ ను ఈ సమయంలో అభివృద్ధి చేయకపోవడం దుర్మార్గమ న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, జి.యస్. రాజేశ్వరరావు, జి.నాయనబాబు, ఆర్.శంకరరావు, వి.వి.శ్రీనివాస్, పి.వెంకటరావు, కె.కుమారి, అనపర్తి అప్పారావు, కె.ఎం.కుమార్. మంగళం, సింహాచలం, బేగం తదితరులు పాల్గొన్నారు.

## కోటబొమ్మాళిలో కరోనా విజృంభణ

**కోటబొమ్మాళి, వార్తావళి, ఆగస్ట్ 26:** కరోనా వైరస్ మహమ్మారి కోటబొ మ్మాళి మండలంలో రోజురోజుకి కేసుల సంఖ్య పెరుగుతున్నాయే గాని అదుపులోకి రావడంలేదు. కరోనా కేసులు పెరుగుతుండ టంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటి వరకు రోజు ఏదోఒక గ్రామంలో ఒకటి, రెండు చొప్పున్న కరోనా పాజిటివ్ కేసులు నమో దు అయ్యేవి ఆయా గ్రామాలను కంటైన్మెంట్ జోనులుగా అధికా రులు ప్రకటించేవారు. అయితే మంగళవారం కోటబొమ్మాళి మం డల కేంద్రంలో మూడు, ఇదే పంచాయతీ బంజీరుపేట గ్రామంలో ఒకటి మొత్తం 4 పాజిటీవ్ కేసులు నమోదు కావటంతో మండల కేంద్రానికి వివిధ పనులు, నిత్యావసర సరుకులు కోసం వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అయితే ఈ కాలనీలకు రాక పోకలు జరగకుండా ఇరువైపుల అడ్డుకట్టలు వేశామని తహసీల్ధార్ డి సోనికిరణ్, ఆర్ఐలు కె.రాము తెలిపారు. గ్రామాల ప్రజలు కూడా తమకు సహకరించి స్వీయ నియంత్రణ పాటించాలని వారు సూ చించారు. దీంతో కరోనా ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే అవకా శం ఉండ బోదన్నారు. ఈ గ్రామాల ప్రజలకు అవసరమైన నిత్యావ సరాలు ప్రత్యేకించి వారి వద్దకే చేరవేయటం జరుగుతుందన్నారు. గ్రామాల్లో సోడియం హైపోక్లోరైడ్ ద్రావణం, బ్లీచింగ్ పిచికారీ చేశామన్నామని, ప్రజలు అవగాహన పెంచుకొని మాస్కులు ధరిం చాలని, శానిటైజర్లు వినియోగించటంతోపాటు భౌతిక దూరం పాటించాలన్నారు.

## అబ్బురపరుస్తున్న బీరకాయ

**కోటబొమ్మాళి, వార్తావళి, ఆగస్ట్ 26:** మండలంలోగల కొత్తపేట గ్రామా నికి చెందిన రామకోటి అనే వ్యక్తి ఇంట్లో మూడు అడుగులు బీరకాయ కాయడంతో అందరికి అబ్బుర పరుస్తుంది. రామకోటి ఇంటి ముందు పెరటలో మూడు అడుగుల బీరకాయ కనడడంతో దారి గుండా వెళ్ళే వారంత దానిని చూస్తు అక్కడే కొద్దిచేపు ఆగి చూసి వెలుతున్నారు.

## మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు

**కోటబొమ్మాళి, వార్తావళి, ఆగస్ట్ 26:** మండలంలోగల పాకివలస గ్రా మం వద్ద అదే గ్రామానికి చెంది న బొమ్మాళి రవికుమార్‌వద్ద ఒడి స్సాకు చెందిన 30 మద్యం సీసా లతో వస్తుండగా పట్టుకొని మంగ ళవారం అరెస్టు చేశామని స్థానిక ఎక్సైజ్ సిఐ కె. మన్మధరావు తెలి పారు. ఈ చుట్టు పక్కల గ్రామా ల్లో అక్రమంగా మద్యం విక్రయి స్తున్నారని సమాచారం రావటం తో దాడులు చేసి పట్టుకున్నామ న్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి వచ్చేనెల 8వ తేదీ వరకు రిమెండ్‌కు పంపించినట్లు ఆయ న తెలిపారు. ఈ దాడుల్లో ఎస్.ఐ డి.ప్రబాకర్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారన్నారు.

## తొట్లకొండ భౌద్ధ క్షేత్రాల పరిరక్షణకు ఉద్యమం...

- బుద్ధిష్ట్ మాన్యుమెంట్ ప్రొటెక్షన్ కమిటీ చేస్తున్న ఆందోళనకు మద్దతు...
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి

**విశాఖపట్నం, వార్తావళి, ఆగస్ట్ 26:** క్రీ॥ పూ॥ 3వ శతాబ్దం నాటి 2400 సం॥ల చరిత్ర కలిగిన తొట్లకొండ బౌద్ధ రాము భారతదేశానికి, ఆంధ్ర రాష్ట్రానికి అతి ప్రాముఖ్యమైన సాంస్కృతిక వారసత్వ ప్రపంచంలో మరెక్కడా కనబడని సముద్రతీర బౌద్ధరామాలైన బావికొండ, తొట్ల కొండ, పావురాలకొండ, ధారకొండ విశాఖపట్నానికి అరుదైన సాంస్కృ తిక సంపదని వీటి పరిరక్షణకు సీపీఐ కృషి చేస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి స్పష్టం చేశారు. బుద్ధిష్ట్ మాన్యుమెంట్ ప్రొటెక్షన్ కమిటీ ప్రతినిధి బృందం బుధవారం సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తికి తొట్లకొండ పరిరక్షణకు కృషి చేయాలని, తాము చే స్తున్నా ఉద్యమానికి మద్దతు ప్రకటించాలని ఓ వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా జె వి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత గల బౌద్ధరామాలు మరీ ముఖ్యంగా తొట్లకొండ గత 30 సంవత్సరాలుగా రకరకాల దురాక్రమలకు గురవుతోందని పేర్కొంటూ తొట్లకొండ మొత్తం 600 ఎకరాలు, మిగతా ప్రాంతాల్లో త్రవ్వకాలు జరపాలని పురవాస్తు చరిత్రకారులు సూచించినప్పటికీ ఆర్కియాలజీ డిపార్టుమెంట్ అన్వేషణలు జరపకపోగా బౌద్ధ క్షేత్రాలు కుదించి వేసి కొన్ని తొట్లు బయటకు వదిలేసి కంచె వేషిన విషయం తెలిసిందేనని, తొట్లకొండ పై జరిగిన ఆక్రమణల చరిత్ర గమనిస్తే రాష్ట్ర ఆర్కియాలజీ డిపార్టుమెంట్ ను టూరిజం శాఖకు అనుబంధం చేసి పురావస్తు అవశేషాలను కాంట్రాక్టర్లతో ధ్వంసం చేశారని విమ ర్శించారు. గౌ॥ దివంగత ముఖ్యమంత్రి డా॥ వై. ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నేవీ వారికి తొట్లకొండ మీదనుంచి రోడ్డు అనుమతులి వడంకు వ్యతిరేకంగా ఆనాడు సీపీఐ, విశాఖపట్నం ప్రజలు బుద్ధిష్ట్ మాన్యుమెంట్ ప్రొటెక్షన్ కమిటీ, బౌద్ధ సంఘాల పోరాట ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రిగారు రోడ్డును వేయాలన్న ప్రతిపాదనను విరమించుకున్నారని తెలిపారు. తదుపరి తెలుగుదేశం ప్రభుత్వంలో సినిమాక్లబ్ కు



15 ఎకరాలు ఇస్తున్నట్లు ప్రకటన చేసి భూమిపూజ చేశారు. ఆ సందర్భంలో సీపీఐ, బౌద్ధ మైనారిటీ సంఘాలు నిరసన వ్యక్తం చేయడం వల్ల అది వెన్నక్కి వెళ్లిందని గుర్తు చేశారు. తొట్లకొండపై గత ప్రభుత్వం భీమిలి ఎమ్మార్వోతో రెండు సర్వే నెంబర్లుగా వేయించి తొట్లకొండ కుట్రపూరితంగా నాశనం చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం. పైడిరాజు, బుద్దిస్టు మాన్యుమెంట్స్ ప్రొటక్షన్ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి వెంకటరమణ, కో కన్వీనర్ ఎం.మల్లయ్యరాజు, సభ్యులు ఎస్. చంద్రశేఖర్, బి. రమణ,తదితరులు ఉన్నారు.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006